పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతిగృహాల్లో అందరూ పాసవ్వాలి
- ఇప్పటి నుంచే ప్రణాళిక అమలు
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- ప్రిన్సిపాళ్లు, వార్డెన్లతో వీడియో కాన్ఫరెన్స్



· 8లో

ఏటికొప్పాక కళాకారుడికి రాష్ట్రపతి పురస్కారం

- ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న గొర్సా సంతోశ్

ఎలమంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంకుడు కర్రతో తయారు చేసే లక్కబొమ్మల తయారీకి ప్రసిద్ధిగాంచిన ఏటికొప్పాక గ్రామానికి చెందిన హస్తకళాకారుడు గొర్సా సంతోశ్ ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా పురస్కా రాన్ని అందుకున్నారు. సంతోశ్ వివిధ దేవతామూర్తులతో బొమ్మల కొలువును తయారుచేసినందుకు 2023-24 సంవ త్సరానికి ఉత్తమ హస్తకళల పురస్కా రానికి ఎంపికైన విషయం తెలిసిందే. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము అవార్డును అందించారు. సంతోశ్ సుమారు నెలరోజులపాటు శ్రమించి బొమ్మల కొలువు కళాఖండాన్ని తయారు చేశారు. గతంలో ఢిల్లీలో జరి గిన గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్న శకటాన్ని ఏటికొప్పాక హస్తకళల ను ప్రతిబింబించేలా తయారీ చేసిన వారిలో సంతోశ్ కీలకపాత్ర పోషించారు.






రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న ఏటికొప్పాక హస్తకళాకారుడు గొర్సా సంతోశ్, అంకుడు కర్రతో రూపొందించిన బొమ్మల కొలువు కళాఖండం

12న సీఎం విశాఖ రాక

కాగ్నిజెంట్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

- అదే రోజు రుషికొండ హిల్-3పై తాత్కాలిక కార్యాలయం ప్రారంభం



విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 12వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. కాగ్నిజెంట్ సంస్థకు కాపులుప్పాడలో భూమి కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారు. దాంతో పాటు విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ సమావేశం కూడా నిర్వహించనున్నారు. అదే విధంగా రుషికొండ ఐటీ పార్కులో కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని కూడా ప్రారంభించనున్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి కలెక్టర్ ఆయా ప్రాంతాలను సందర్శించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. రుషికొండ ఐటీ పార్కులో హిల్ నంబరు 3పై సీఎం దిగే హెలిపాడ్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ అధికారులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు

నిబంధనలను ఉల్లంఘిస్తున్న నిర్వాహకులు

- బట్టీల ఏర్పాటు నుంచి మట్టి తవ్వకాల వరకు అనుమతులు నిల్
- ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో రాయల్టీ ఎగవేత
- ఒడిశా నుంచి తక్కువ వేతనాలకు కూలీలను తెచ్చుకుంటున్న యాజమాన్యాలు
- కార్మిక చట్టాలకు తూట్లు
- పట్టించుకోని రెవెన్యూ, గనులు, పర్యావరణ, కార్మిక శాఖల అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)


ఇటుకల బట్టీల నిర్వాహకులు పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. ఇటుకల తయారీ కోసం ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. మరోవైపు ఇటుకల కాల్చే సమయంలో పెద్దఎత్తున పొగ ఎగిసి పడుతున్నది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇటుల బట్టీల నిర్వాహకుల తీరు ఇష్టారాజ్యంగా తయారైంది.

వర్షాకాలం ముగియడంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది సిమెంట్ (ఫాల్‌జీ) ఇటుకలకుబదులు బట్టీల్లో తయారైన మట్టి ఇటుకల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. దీంతో ప్రస్తుతం బట్టీల్లో ఇటుకల తయారీ ముమ్మరంగా సాగుతున్నది. వాస్తవంగా ఇటుక బట్టీ ఏర్పాటు చేయాలంటే స్థానిక గ్రామ పంచాయతీ, రెవెన్యూ, గనులు, కార్మిక, పర్యావరణ, భూగర్భ జలవనరుల శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఇటుకల తయారీకి



అనకాపల్లి మండలం సీతానగరంలో ఇటుకల తయారీ బట్టీ

అవసరమైన మట్టి తవ్వకాల కోసం గనుల శాఖ అనుమతి వుండాలి. లక్ష ఇటుకలు తయారు చేస్తే.. స్థానిక గ్రామ పంచాయతీకి, గనుల శాఖకు రూ.10 వేలకు తక్కువ కాకుండా రాయల్టీ చెల్లించాలి. కానీ జిల్లాలో అత్యధిక శాతం ఇటుకల బట్టీల నిర్వాహకులు ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. జిల్లాలో సుమారు 380 ఇటుక బట్టీలు ఉన్నట్టు గనుల శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఈ సంఖ్యకు రెట్టింపు వుంటుంది. ఇటుకల తయారీకి అవసరమైన మట్టిని చెరువులు, వాగుల్లో నుంచి తవ్వుకుపోతున్నారు. వాస్తవంగా మట్టి తవ్వకాల కోసం రెవెన్యూ, గనుల శాఖలతోపాటు అవసరమైతే జలవనరుల శాఖ నుంచి కూడా అనుమతి పొందాలి. క్యూబిక్ మీటరు మట్టికి రూ.42 చొప్పున ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలి. కానీ జిల్లాలో మట్టి తవ్వకాలు జరుపుతున్న ఇటుక బట్టీల నిర్వాహకుల్లో అత్యధికులు రాయల్టీ చెల్లించడం లేదని గనుల శాఖ అధికారుల సమాచారం. ఇటుక బట్టీల కోసం అనకాపల్లి మండలం కుంచంగి, కూండ్రం, తుమ్మపాల, సబ్బవరం మండలం అంతకాపల్లి, చోడవరం మండలం వెంకన్నపాలెం ప్రాంతంలోని చెరువులు, జిరాయితీ భూముల్లో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి.



సబ్బవరం మండలం దేవీపురం వద్ద ఇటుకల బట్టీ

ఇటుకబట్టీల్లో పనిచేసే కార్మికులకు ... మిగతా 8వ పేజీలో

రాంబిల్లిలో సోలార్ కంపెనీ

రూ.3,990 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు 'రెన్యూ ఎనర్జీ' సంస్థ సిద్ధం

- సోలార్ ప్లేట్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు
- హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టు, గ్రీన్ అమ్మోనియా ప్లాంటు, ఐదు గిగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- మొత్తం పెట్టుబడి రూ.82 వేల కోట్లు



విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి ఇంటిగ్రేటెడ్ సోలార్ ఇన్‌గాట్ అండ్ వేఫర్ తయారీ పరిశ్రమ అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏర్పాటు కానుంది. సోలార్ విద్యుత్ తయారీకి అవసరమైన ఫొటోవాల్టిక్ (సోలార్) పలకలను ప్రస్తుతం విదేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల సోలార్ విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అనేక ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయి. వాటికి అవసరమైన ముడి సరకుకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఇక్కడే వాటిని తయారుచేయాలని 'రెన్యూ ఎనర్జీ గ్లోబల్ పీఎల్‌సీ' అనే సంస్థ రూ.3,999 కోట్లతో రాంబిల్లిలో ఇంటిగ్రేటెడ్ ప్లాంటు ఏర్పాటుకు ముందుకువచ్చింది. దీనికోసం రెన్యూ ఫొటోవాల్టాయిక్స్ పేరుతో అనుబంధ సంస్థను ఏర్పాటుచేసింది. ఆరు గిగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసే ఈ ప్లాంటు కోసం రాంబిల్లిలో 130 నుంచి 140 ఎకరాలు కావాలని కోరింది. రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో స్క్రబ్ టైఫస్

చౌడువాడ, దేవరాపల్లిలో ఒక్కొక్కరికి వ్యాధి లక్షణాలు

- తీవ్రజ్వరం, శరీరంపై దద్దుర్లు
- రక్త నమూనాలు సేకరించిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలిసారి స్క్రబ్ టైఫస్ కేసులను వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. దేవరాపల్లి, కె.కోటపాడు మండలం చౌడువాడల్లో ఇద్దరికి ఈ వైరస్ లక్షణాలు కనిపించడంతో అధికారులు రక్తనమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కు పంపించారు. ఈ వ్యాధి రికెట్టియా అనే బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుందని, ఈ బ్యాక్టీరియా కలిగిన మైట్ (పేడ పురుగు) లార్వా కుట్టినవారు స్క్రబ్ టైఫస్ బారిన పడతారని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వీరజ్యోతి తెలిపారు. వ్యవసాయ పనులు చేసేవారు ఈ పురుగు బారిన పడతారని, ఇది కుట్టినచోట నల్లటి మచ్చ వస్తుందని చెప్పారు. ఇంకా తీవ్రమైన జ్వరం, శరీరం మీద దద్దుర్లు, కండ్లకలక, దగ్గు, ఒంటినొప్పులు, ఊపిరి తీసుకోవడం కష్టంగా వుండడం, బీపీ పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వరుసగా రెండు రోజులపాటు తీవ్రమైన జ్వరం వుంటే.. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. పొలం పనులు చేసేటప్పుడు శరీరం మొత్తం వస్త్రాలతో కప్పుకొని, చెప్పులు ధరించాలని సూచించారు. డాక్టర్ పర్యవేక్షణలో ఐదు నుంచి ఏడు రోజులపాటు మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందని చెప్పారు.

గర్భం దాల్చిన కేజీబీవీ విద్యార్థిని?

- అమ్మమ్మను పాఠశాలకు రప్పించి, బాలికను ఇంటికి పంపిన అధికారులు

గొలుగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): **మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో పదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థిని గర్భం దాల్చినట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న విద్యాలయం సిబ్బంది...బాలిక అమ్మమ్మను రప్పించి, ఆమెతో ఇంటికి పంపినట్టు చెబుతున్నారు.**

గొలుగొండ మండలంలో ఒక గ్రామానికి చెందిన బాలిక ఇక్కడ కేజీబీవీలో పదో తరగతి చదువుతున్నది. తండ్రి మృతిచెందడంతో తల్లి మరో పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి అమ్మమ్మ సంరక్షణలో బాలిక పెరుగుతున్నది. కాగా బాలికకు రెండు రోజుల నుంచి వాంతులు అవుతుండడంతో విద్యాలయం సిబ్బంది వైద్య సేవలు అందించారు. అయినా వాంతులు తగ్గకపోవడంతో అనుమానం వచ్చి పరీక్ష చేయించగా బాలిక గర్భవతి అని తేలడంతో అమ్మమ్మకు కబురు చేశారు. ఆమె వచ్చి మనవరాలిని ఇంటికి తీసుకువెళ్లినట్టు తెలిసింది.

కాగా గొలుగొండ కేజీబీవీలో పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గత వారం ఒకరోజు రాత్రి బాలికలకు భోజనం వడ్డించడంలో తీవ్ర జాప్యం జరిగింది. బాలికలు అన్నం తినేసరికి రాత్రి 11 గంటలు దాటింది. అలాగే రెండు రోజుల క్రితం పిల్లలను కలిసేందుకు తల్లిదండ్రులు ఇక్కడకు రాగా...ప్రిన్సిపాల్ సుధ నిరాకరించారు. దీంతో వారు గేటువద్ద ఆందోళన చేశారు. తాజాగా ఒక విద్యార్థిని గర్భం దాల్చిన విషయం బయటకు పొక్కడంతో ప్రిన్సిపాల్ ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయినట్టు ప్రచారం జరిగింది. దీనిపై ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ వివరణ కోరగా...ఈ విషయం తన దృష్టికి కూడా వచ్చిందని, ఆమెకు ఫోన్ చేయగా...తాను రిజైన్ చేయలేదని చెప్పారని ఆయన తెలిపారు.

ఊరూరా గ్రావెల్ దోపిడీ

కొండపోరంబోకు, బంజరు, అటవీ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు

- అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు
- కొన్నిచోట్ల అధికార, ప్రతిపక్షాల నాయకులు కుమ్మక్కు
- అక్రమ తవ్వకాలపై స్థానికుల ఫిర్యాదులు
- పట్టించుకోని నియంత్రణ శాఖల అధికారులు



సబ్బవరం సూది కొండపై గ్రావెల్ తవ్వకాలు జరిపిన ప్రదేశం

సబ్బవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. మీడియాలో కథనాలు వస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. రోజురోజుకు గ్రావెల్, మట్టి తవ్వకాలు పెరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల



అరిపాక పోతుకొండ అటవీ శాఖ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

అక్రమ తవ్వకందారులకు అధికారంలో వున్న కూటమి పార్టీలకు చెందిన కొంతమంది స్థానిక నేతలు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని గ్రామాల్లో అధికార, ప్రతిపక్షాల నేతలు ఒక్కటై గ్రావెల్ దందా సాగిస్తున్నారు. పైడివాడ, పైడివాడఅగ్రహారం, గాలిభీమవరం ఎన్టీఆర్ కాలనీలను ఆనుకొని ఉన్న కొండలు, బంజరు భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇంకా రాయపురఅగ్రహారం, ఒమ్మివానిపాలెంలోని బంజరు భూముల్లో కూడా గ్రావెల్, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఒక్కడ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ అక్రమార్కులు లెక్కచేయడంలేదు. ఇక మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న సూది కొండవాలు ప్రాంతంలో (సర్వే నంబరు 286) గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు చేస్తున్నా రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక అమృతపురం సర్వే నంబరు 303లో కూడా ... మిగతా 8వ పేజీలో

కోతుల బెడద లేకుండా చూస్తాం

రావికమతం హాస్టల్ విద్యార్థినుల తల్లిదండ్రులకు ఎంఈవో, ఎస్‌ఐ భరోసా

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో అధికారుల్లో కదలిక

రావికమతం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో వుంటున్న బాలికలకు కోతుల బెడద నుంచి పూర్తి రక్షణ కల్పిస్తామని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని ఎంఈఓ లింగమూర్తి, ఎస్‌ఐ ఎంరఘువర్మ భరోసా ఇచ్చారు. హాస్టల్‌లోకి అర్ధరాత్రిపూట కుక్కలు, కోతులు యథేచ్ఛగా వచ్చి, బాలికలపై దాడి చేస్తుండడంతో 'నిన్న కుక్కలు.. నేడు కోతులు' అన్న శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆయా విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్రఆందోళన చెంది, ఉదయాన్నే హాస్టల్ వద్దకు వచ్చారు. తరువాత ఎంఈఓ, ఎస్‌ఐలు వచ్చి మేట్రిన్ లలితతో మాట్లాడారు. హాస్టల్లోకి కుక్కలు, కోతులు వచ్చి తమ పిల్లలపై దాడి చేస్తున్నాయని, ఇక్కడ వుండలేమని ఏడుస్తూ వారు చెబుతుండడంతో ఇళ్లకు తీసుకెళ్లడానికి వచ్చామని పలువురు తల్లిదండ్రులు చెప్పారు. తమ పిల్లలకు పూర్తిరక్షణ కల్పిస్తామని భరోసా ఇస్తేనే హాస్టల్‌లో వుంచుతామని, లేదంటే తీసుకెళ్లిపోతామని ... మిగతా 8వ పేజీలో



ఎంఈవో, ఎస్‌ఐలతో మాట్లాడుతున్న మేట్రిన్ లలిత. పక్కన విద్యార్థినుల తల్లిదండ్రులు

మైదాన ప్రాంతంలోనూ గజగజ

- పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- పెరిగిన మంచు ప్రభావం

నక్కపల్లి/ మాడుగుల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆకాశం నిర్మలంగా వుండడం, ఉత్తరాది నుంచి శీతలగాలులు వీస్తుండడంతో జిల్లాలోని మైదాన ప్రాంతంలో కూడా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. నాలుగు రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. శీతల గాలుల కారణంగా పట్టపగలు సైతం వాతావరణం చల్లగా వుంటున్నది. రాత్రి ఏడు గంటల తరువాత జనం ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఏజెన్సీని తలపించేలా అర్ధరాత్రి నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తున్నది. చలిబారి నుంచి శరీరాన్ని కాపాడుకునేందుకు, వ్యాధులబారిన పడకుండా వుండేందుకు ప్రజలు పలు జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఉన్ని దుస్తులు ధరించి, వీధుల్లో చలిమంటలు వేసుకుంటున్నారు. నక్కపల్లి మండలంలో మంగళవారం తెల్లవారుజామున 14 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా ఏజెన్సీని ఆనుకొని ఉన్న మాడుగుల మండలంలో చలితీవ్రత అధికంగా వుంది. పొగమంచు దట్టంగా కురుస్తున్నది. ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు, చలితీవ్రత తగ్గడం లేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచి శీతలగాలులు వీస్తున్నాయి. రానున్న కొద్ది రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగి, ఉష్ణోగ్రతలు తగ్గిపోతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



నక్కపల్లిలో చలిమంటతో ఉపశమనం

నక్కపల్లికి నిప్పన్ కంపెనీ ప్రతినిధులు

- స్టీల్‌ప్లాంటుకు కేటాయించిన భూముల పరిశీలన



స్టీల్‌ప్లాంటుకు కేటాయించిన భూములను పరిశీలిస్తున్న నిప్పన్ కంపెనీ ప్రతినిధులు

నక్కపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీ ప్రతినిధుల బృందం మంగళవారం సాయంత్రం నక్కపల్లి మండలంలో పర్యటించింది. లక్సెంబర్గ్‌కు చెందిన ఆర్సెలార్ మిట్టల్-జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ కంపెనీ సంయుక్తంగా మండలంలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. స్టీల్‌ప్లాంటు కోసం ప్రభుత్వం బుచ్చిరాజుపేట, చందనాడ, డీఎల్‌పురం, రాజయ్యపేట, వేంపాడు గ్రామాల పరిధిలో 2,164.31 ఎకరాలను కేటాయించింది. ఈ మేరకు మంగళవారం నిప్పన్ స్టీల్‌ప్లాంటు ప్రతినిధులు జపాన్ నుంచి విశాఖ వచ్చి, అక్కడి నుంచి నక్కపల్లి చేరుకున్నారు. స్టీల్‌ప్లాంటుకు కేటాయించిన భూములను పరిశీలించారు. వీరి వెంట ఎస్‌ఐ సన్నిబాబు, రెవెన్యూ సిబ్బంది వున్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు


పాయకరావుపేట చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక అరటి గెలల మార్కెట్ చర్చిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాస్టర్లు దేవుని వాక్యం వినిపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక అకాడమి డైరెక్టర్ పల్లా విలియం కేరి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు పాస్టర్లను ఘనంగా సత్కరించి ఆశీర్వాదించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, వేములపూడి అప్పారావు, గొల్లపల్లి నాగు, ఏడిద సురేష్, నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు నెలపర్తి నాగేశ్వరరావు, సీహెచ్.కొండబాబు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా, కుర్చీలు వితరణ


హెచ్ఎం అరుణకు బీరువా, కుర్చీలు అందజేస్తున్న బంగారి, వెంకటరాజు

ఎస్.రాయవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం జడ్పీ హైస్కూల్‌కు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చోడిపిల్లి బంగారి తన సొంత నిధులతో బీరువా, కొన్ని కుర్చీలను సమకూర్చారు. మంగళవారం వీటిని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, బంగారి పాఠశాల హెచ్ఎం అరుణకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ బంగారి విద్యార్థుల కోసం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలు విజన్ అవసరం : ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చిన్నారావు

అచ్యుతాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో పేదరికం లేని సమాజం కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులు విజన్ కలిగి ఉండాలని ఎంపీడీవో చిన్నారావు అన్నారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన ఏసీఎల్ఎఫ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజన్ అమలుచేయడానికి అన్ని గ్రామ సంఘాల్లో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సుస్థిర జీవనోపాదులు, విద్య, ఆరోగ్యం ప్రకృతి వ్యవసాయం, లింగ వివక్ష, సామాజిక భద్రత తదితర అంశాలపై సభ్యులకు ఈనెల 12 వరకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ శ్రీనివాసరావు, స్త్రీనిధి మేనేజర్ సుశీల, గ్రేస్ సీసీలు కె. పద్మావతి, రాజా రమేష్, నాగరాజు, సరోజిని, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలకంఠేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయం పునఃనిర్మాణ 3వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి, మాజీ సర్పంచ్ సుందరపు వెంకట కనకఅప్పారావు, బొమ్మిరెడ్డిపల్లి శ్రీనివాసరావు, సుందరపు కాసులుబాబు తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో మిషనరీ వినియోగంపై వివరాల సేకరణ


పీఏసీఎస్‌లో వివరాలు సేకరిస్తున్న ఏవో జ్యోత్స్నకుమారి

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో మిషనరీ వినియోగంపై వివరాలను సేకరిస్తున్నామని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక సొసైటీ పరిధిలో వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సూచనల మేరకు మునగపాక, నాగులాపల్లి, చూచుకొండ పీఏసీఎస్‌ల పరిధిలో సాగుకు సంబంధించి విస్తీర్ణం, రైతుల వివరాలతో కూడిన నివేదికను రూపొందిస్తున్నామన్నారు. సాగు పనులకు కూలీల కొరత నేపథ్యంలో అవసరమైన మిషన్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలు భాగంగా వివరాలు సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ విల్లూరి నూకనర్సింగరావు, సీఈవోలు మళ్ల స్వామి, పెంటకోట మహేశ్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రాజు కుటుంబానికి బీమా చెక్కు అందజేత


రాజు భార్య సంధ్యకు బీమా చెక్కును అందజేస్తున్న బ్యాంకుల అధికారులు

రాంబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పన్నపాలెం గ్రామానికి చెందిన లాలం రాజు ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. దీంతో ఆయనకు బ్యాంక్ ద్వారా మంజూరైన రూ.10లక్షల బీమా చెక్కును మంగళవారం రాజు భార్య సంధ్యకు ఏపీ గ్రామీణబ్యాంక్ రీజనల్ మేనేజర్ సతీష్‌చంద్ర, బోగాపురం బ్యాంక్ మేనేజర్ డి.మహేష్, ఏపీ గ్రామీణబ్యాంక్ జనరల్ అసిస్టెంట్ మేనేజర్ కె.రవికృష్ణ, బ్యాంక్ నోడల్ అధికారి మోహన్‌రెడ్డి, సీఐ నర్సింగరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు రాయండి

» కలెక్టర్ విజయ్ కృష్ణన్


టెన్త్ బాలికలతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ కృష్ణన్

నక్కపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను ప్రశాంతంగా రాయాలని, ఎటువంటి టెన్షన్ పడకూడదని, అప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ సూచించారు. మంగళశారం రాత్రి నక్కపల్లి కేజీబీవీని ఆమె తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థినుల ప్రత్యేక స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. బాలికలతో మాట్లాడారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఉన్నత లక్ష్యంతో నిరంతరం శ్రమించాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ చందనాడ, పెదబోదిగల్లం గ్రామాల్లో పర్యటించారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసిత బాధితుల కోసం బోదిగల్లం వద్ద ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీని ఆమె పరిశీలించారు. ఎంతమంది ఇప్పటివరకూ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారో తహశీల్దార్ నర్సింహమూర్తిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇంటి సామగ్రి రవాణా చేసేందుకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుని వారికి సహకరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీవో వీవీ రమణ ఉన్నారు.

పాయకరావుపేటలో 56 హెల్త్ క్లినిక్‌లు

పాయకరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 56 హెల్త్‌క్లినిక్‌ల ఏర్పాటు కోసం రూ.11 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర హోం మంత్రి అనిత కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. నేషనల్ హెల్త్ మిషన్, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్, 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదలయ్యే నిధులతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 54 విలేజి హెల్త్ సెంటర్లు, రెండు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో పాయకరావుపేట పీహెచ్‌సీ, ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు పీహెచ్‌సీలో రూ.50 లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇక విలేజి హెల్త్ సెంటర్లు పాయకరావుపేట మండలంలో 17, నక్కపల్లి మండలంలో 15, కోటవురట్ల మండలంలో తొమ్మిది, ఎస్.రాయవరం మండలంలో 13 భవనాలు నిర్మించనున్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

మునగపాక సంపద కేంద్రం వద్ద ఉద్రిక్తత

» పొగ సమస్య లేకుండా చేస్తానని కార్యదర్శి హామీ

» శాంతించిన యువకులు, మహిళలు


సంపద తయారీ కేంద్రం తాళం తీస్తున్న శెట్టిబలిజ యువకులు

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మునగపాక సంపద కేంద్రం వద్ద మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. సంపద తయారీ కేంద్రానికి తాళం వేయడంపై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఏఎస్ఐ నాగేశ్వరరావు సంపద కేంద్రం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా శెట్టిబలిజ కాలనీకి చెందిన యువకులు, మహిళలు కూడా వచ్చారు. సంపద కేంద్రంలో చెత్తకు నిప్పు పెట్టడం వలన దట్టమైన పొగ కాలనీ వాసులపై తీవ్ర ప్రభావం చూపుతున్న విషయాన్ని సర్పంచ్, తదితరులకు చెప్పినా ఫలితం కనిపించకపోవడంతో తాళం వేయాల్సి వచ్చిందని యువకులు, మహిళలు చెప్పారు. చెత్తకు నిప్పు ఎవరు పెట్టారో తెలియదని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. శ్మశానవాటికలో ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూనే ఉన్నామన్నారు. సర్పంచ్ వ్యాఖ్యలపై కొంతమంది యువకులు తీవ్రంగా విభేదించి వాగ్వాదానికి దిగారు. ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు నచ్చజెప్పారు. ఏదైనా సమస్య ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలే గాని తాళం వేయడం వంటి చట్టవిరుద్ధమైన చర్యలు చేయకూడదన్నారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ పొగ సమస్యతో పాటు శ్మశాన వాటికను శుభ్రం చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఏఎస్ఐ సమక్షంలో సంపద కేంద్రానికి వేసిన తాళాన్ని శెట్టిబలిజకు చెందిన యువకులు తొలగించారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం


పెంటకోట రోడ్డులో డైవర్షన్ రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటకోట వెళ్లే రోడ్డులో కల్వర్టు నిర్మాణ పనులను ఎట్టకేలకు మంగళవారం ప్రారంభించారు. కల్వర్టు నిర్మాణ పనులలో భాగంగా నీరు పోవడానికి మంగళవారం డైవర్షన్ రోడ్డుకు తూరలు వేశారు. ఈ కల్వర్టు ఏడున్నర సంవత్సరాల క్రితం కూలిపోయింది. వెంటనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఎమ్మెల్యే వంగలపూడి అనిత కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయితే కాంట్రాక్టరు కల్వర్టు పనులు ప్రారంభించిన వెంటనే భారీ వర్షాలు కురవడంతో పనులకు ఆటంకం ఏర్పడి పనులను నిలిపివేశారు. తరువాత కాంట్రాక్టరు పనులను ప్రారంభించలేదు. తర్వాత రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాటి నుంచి ప్రజల రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీసం కల్వర్టు గురించి పట్టించుకోలేదని శ్రీరాంపురం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర హోం మంత్రి అనిత పెంటకోట, అరట్లకోట గ్రామాల సమీపంలోని ప్రధాన రోడ్డులో కల్వర్టుల నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. మంగళవారం పనులు ప్రారంభించి డైవర్షన్ రోడ్డులో తూరలు ఏర్పాటు చేశారు. సొసైటీ ఛైర్‌పర్సన్ చిక్కాల శ్రీనివాసరావు పనులను పరిశీలించారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నక్కపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు జడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీ, గురుకులంలో టెన్త్ చదువుకుంటున్న 1300 మంది విద్యార్థులకు జిల్లా ఉమ్మడి పరీక్షామండలి తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను హెటిరో యాజమాన్యం సమకూర్చింది. మంగళవారం వేంపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీని హెటిరో సీఎస్ఆర్ హెడ్ సుధాకర్ ప్రారంభించారు. అదేవిధంగా 2024-25లో టెన్త్‌లో జిల్లా టాపర్‌గా నిలిచిన విద్యాసాగర్ సహా మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు రూ.3.5లక్షలను చెక్‌ల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా హెటిరో ఔషధ పరిశ్రమ సేవలను ఎంఈవోలు నరేశ్, నాగన్నదొర, సీనియర్ హెచ్ఎం వేమగిరి నూకరాజు ప్రశంసించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం వరలక్ష్మి, వేంపాడు సర్పంచ్ ఏడిద నూకరత్నం, ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, గ్రామ పెద్ద మణిరాజు, ఎంపీటీసీ సభ్యుడు కుంచె మధు, ఎస్ఎంసీ ఛైర్మన్ బాబూరావు జిల్లా డీసీఈబీ బోర్డు సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్క్రబ్ టైఫస్ వ్యాధి అప్రమత్తం అవసరం'

పాయకరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలకు స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి రికెట్సియా అనే బాక్టీరియా వలన వస్తుందన్నారు. ఇవి మైట్స్ రూపంలో ఉండి ఎలుకలు, పందికొక్కుల మీద పరాన్నజీవులుగా నివసిస్తాయన్నారు. మైట్స్ లార్వా ద్వారా మనిషికి స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ఎలుకలు, పందికొక్కుల నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది నెహ్రశా వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

కోటవురట్ల ఆస్పత్రిని సందర్శించిన డీఎస్‌హెచ్


పేషెంట్స్‌తో మాట్లాడుతున్న డీఎస్‌హెచ్ శ్రీనివాసరావు

కోటవురట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల వైద్య విధానపరిషత్ ఆస్పత్రిని డీఎస్‌హెచ్ డాక్టర్ శ్రీనివాసరావు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనరల్ వార్డును పరిశీలించి, రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఇటీవల కాయకల్ప అవార్డు కమిటీ పరిశీలించింది. జనవరిలో కాయకల్ప అవార్డు స్టేట్ కమిటీ ఆస్పత్రిని పరిశీలించేందుకు వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీపీ చూడకుండా సెలైన్ బాటిల్స్ ఎక్కించవద్దని సూచించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రసాద్, డాక్టర్లు అనూష్య, కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'భూసార పరిరక్షణ అందరి బాధ్యత'

ఎలమంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూసార పరిరక్షణ అందరి బాధ్యత అని భూసార పరీక్ష జిల్లా అధికారిణి ఎం. విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఎలమంచిలి బాలికోన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సదస్సులో జిల్లా అధికారిణి విజయలక్ష్మి, వ్యవసాయాధికారి మోహనరావు విద్యార్థినులకు భూసార పరిరక్షణ గురించి వివరించారు.

'ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారాన్ని పెంచుకోవాలి'

కోటవురట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూసారాన్ని పెంపొందించుకోవడానికి మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించాలని జిల్లా వనరులు వ్యవసాయాధికారిణి తులసీమణి అన్నారు. మంగళవారం కోటవురట్లలో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రకృతి, ఆర్గానిక్ ఎరువులను వేసుకొని భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. తద్వారా సూక్ష్మ పోషకాలు అయినట్టువంటి జింకు, ఇనుప దాతు లోపం ఉన్న పొలాలు గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. మండలంలో గ్రామవ్యవసాయ సహాయకులు 990 మట్టి నమూనాలు సేకరించారన్నారు. ఈసమావేశంలో వ్యవసాయాధికారిణి సరోజని, వ్యవసాయ విస్తరణఅధికారి మధు, వ్యవసాయ సహాయకులు త్రినాథ్, లీలా, ప్రియాంక పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని నామవరం, పాయకరావుపేట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు భూసార పరీక్షలతో కలిగే ఉపయోగాలను వివరించారు. వరి కోతలు కోయడానికి మూడు రోజుల ముందుగా అపరాలు చల్లుకోవాలన్నారు. మినుములు ఎకరానికి 12 కిలోలు, పెసలు ఎకరానికి 8 నుంచి 10 కిలోలు చల్లుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది వి. శ్రవణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని గొడిచెర్ల, డొంకాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో కె.ఉమాప్రసాద్ నేతృత్వంలో వ్యవసాయ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వరి కోతలను పరిశీలించారు. అనంతరం ఏ రకమైన అపరాలు సాగు చేయాలో రైతులకు వివరించారు. రెల్లురాల్చు పురుగు నివారణకు ఎటువంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో అవగాహన కల్పించారు. అర్హత వుండి పీఎం కిసాన్ లబ్ధి పొందని రైతులు త్వరగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, జ్యోత్స్న, నాగేశ్వరరావు, ప్రసన్న పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం అనకాపల్లి వ్యవసాయాధికారిని పి.విజేత మాట్లాడుతూ ప్రస్తుతం వరి గింజ గట్టిపడే పరిస్థితిలో ఉందన్నారు. పొలాల్లో కంకినల్లి, పొట్టకుళ్ల తెగుళ్లను గమనించామన్నారు. ఈ తెగుళ్ల నివారణకు ప్రొఫికొనజోల్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం కొట్టుబోలులో వరి పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సి. సుమంత, ఎంపీఈవో రామారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి బియ్యం, నగదు పంపిణీ


అరట్లకోటలో అగ్ని ప్రమాద బాధితుడు నూకయ్యకు బియ్యం బ్యాగును అందజేస్తున్న పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకోటలో అగ్ని ప్రమాద బాధితుడు మలకా నూకయ్యను మంగళవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టరు పెదిరెడ్డి చిట్టిబాబు పరామర్శించి, బియ్యం బ్యాగు, నగదును అందజేశారు. అదేవిధంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి మంగళవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మలకా నూకయ్యకు బియ్యం బ్యాగు, నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కట్టా శ్రీనివాసరావు, చింతకాయల రాంబాబు, మజ్జూరి నారాయణరావు, తెలుగుయువత మండల అధ్యక్షుడు గొల్లపల్లి నాగు, వేములపూడి అప్పారావు, కుందూరు కుమార్, జనసేన నాయకులు గెడ్డం చైతన్య, యగదాసు నానాజీ, తుమ్మల గణేశ్, వరప్రసాద్, కంకిపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

కాలినడకన తిరుపతికి..

నక్కపల్లి చేరిన భక్తులు

నక్కపల్లి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): కాలినడకన తిరుపతి బయలుదేరి వెళ్తున్న గోవిందమాల ధరించిన భక్తులకు కాగిత గ్రామంలో ఘనస్వాగతం లభించింది. మునగపాక మండలం వాడ్రాపల్లికి చెందిన 10 మంది భక్తులు ఈ నెల 7వ తేదీన కమల వైభోగ వేంకటేశ్వర స్వామి ఆలయ సేవా ట్రస్ట్ ద్వారా విశాఖ నుంచి తిరుపతికి పాదయాత్ర ప్రారంభించారు.

మంగళవారం ఈ బృందం పాదయాత్రతో కాగిత చేరుకుంది. ఈ గ్రామానికి చెందిన పోతంశెట్టి బాబ్జీ వారికి ఆతిథ్యాన్ని అందజేశారు. పదోసారి తిరుమల తిరుపతికి పాదయాత్ర చేస్తున్న పిల్లి సూర్యనారాయణ(71)ను గ్రామస్థులు శాలువతో సత్కరించారు. అంతకుముందు చినదొడ్డిగల్లులో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన రిలే దీక్షలు

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నక్కపలి రెవెన్యూ డివిజన్‌లో మునగపాక మండలాన్ని విలీనం చేయవద్దంటూ వైసీపీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. తొలుత మదర్‌థెరిసా విగ్రహానికి నివాళులర్పించి అనంతం వినతిపత్రంతో వినూత్నరీతిలో నిరసన తెలిపారు. మండలంలో పాటిపల్లి, మంగళవరపుపేట, మూలపేట గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు రెండోరోజు దీక్షలో కూర్చున్నారు. వారికి వైసీపీ నాయకులు కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్, ఆడారి గణపతి అచ్చింనాయుడు తదితరులు సంఘీభావం తెలిపారు.

13న నాగులాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవం

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులాపల్లి గ్రామంలో గౌరీ పరమేశ్వరులు ఉత్సవం ఈనెల 13వ తేదీన జరగనుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవానికి సంబంధించిన గోడపత్రికను అచ్యుతాపురంలో ఎమ్మెల్యే స్వగృహంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ యల్లపు వెంకటభాస్కరరావు, పెతకంశెట్టి రాజు, భీమరశెట్టి భాస్కరరావు, కాండ్రేగుల మోదినాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎర్రవరంలో వినియోగంలోకి చేతిబోరు

అచ్యుతాపురం రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రవరంలోని కొల్లాటి వీధిలో మూతపడిన తాగునీటి చేతిబోరును మంగళవారం వినియోగంలోకి తీసుకువచ్చామని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మి, జాయింట్ సెక్రటరీ నారాయణమ్మ అన్నారు. పదేళ్లుగా బోరు పనిచేయక పోవడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారని, తాము పోరాటం చేసి ఈ చేతి బోరును బాగుచేయించి వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటలక్ష్మి, భవాని, నూకరత్నం, కన్నయ్యమ్మ, లక్ష్మి, అమ్మాజీ, భవాని, దేవి తదితరులు పాల్గొన్నారు.

గణపర్తిలో భూఆక్రమణల పరిశీలన

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపర్తిలో గ్రామకంఠం ఆక్రమణ జరిగిందని అందిన ఫిర్యాదులపై మంగళవారం తహశీల్దార్ పి.సత్యనారాయణ పరిశీలించారు. సర్వే నంబర్లు 138, 139, 35లో గ్రామకంఠం భూమిని అదే గ్రామానికి చెందిన నలుగురు ఆక్రమించారని చదరం శంకర్ ఇచ్చిన ఫిర్యాదు చేశారని తహశీల్దార్ తెలిపారు. అదేవిధంగా సర్వే నెంబర్లు 138, 139, 14లలో ప్రభుత్వ భూమిని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించినట్టు అదే గ్రామానికి చెందిన రాము, సీతారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం వెళ్లి పరిశీలించినట్టు చెప్పారు. ఆ స్థలాలను సర్వే చేయమని సర్వేయర్లకు సూచించడం జరిగిందని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మునగపాక స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ


తహశీల్దార్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

మునగపాక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ విష్ణుస్వరూప్ మంగళవారం సందర్శించారు. స్టేషన్‌లో సిబ్బంది వివరాలు, కేసుల గురించి ఎస్ఐ పి.ప్రసాదరావుతో మాట్లాడారు. అనంతరం డీఎస్పీ తహశీల్దార్‌ను కలిసి చూచుకొండలో గౌరీపరమేశ్వరుల ఉత్సవ కమిటీ అంశంలో చోటుచేసుకున్న వివాదంపై చర్చించారు. ఇరువర్గాలను కలిపేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు ప్రజల వ్యతిరేకం'

ఎస్.రాయవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వం తలపెట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని అడ్డరోడ్డులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 55 వేల మంది నుంచి సంతకాలు సేకరించామన్నారు. కార్యక్రమంలో వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు చిక్కాల రామారావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైసీపీ మండల అధ్యక్షుడు మదువర్మ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలిక మిస్సింగ్‌పై కేసు

ఎలమంచిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 సంవత్సరాల బాలిక మిస్సింగ్ అయినట్టు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ప్రైవేటు స్కూలులో పదో తరగతి చదువుతున్నది. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో పూజ చేసేందుకు రామాలయానికి వెళ్తున్నట్టు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. చాలా సమయం గడిచినా రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా సమాచారం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సావిత్రి తెలిపారు.

దోమల దరవు.. కునుకు కరువు!

పట్టణంలో ఎక్కడికక్కడే పారిశుధ్య లోపం

కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోని అధికార గణం

దోమల స్వైరవిహారం.. ఇబ్బందుల్లో జనం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో ప్రజలు దోమలతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేయింబవళ్లు తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో నిద్రకు దూరమవుతున్నారు. కాలువలు శుభ్రం చేయకపోవడంతో పాటు పలు చోట్ల రోడ్లపైనే మురుగు రోజుల తరబడి తాండవిస్తున్నది. వాటిని దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మార్చుకుంటున్నాయి. శరీరం నిండా బట్టలు కప్పుకున్నా దోమల బారి నుంచి బయటపడలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు. పలు చోట్ల డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు తాగి పారేసిన కొబ్బరి బొండాలు రోడ్లపైనే దర్శనమిస్తున్నాయి. కొబ్బరి బొండాల వల్ల దోమలు ఉత్పత్తి పెరుగుతోంది. ప్రతి ఇంటా దోమల చక్రం లేదా ఆలౌట్‌ను వెలిగించుకోవాల్సి వస్తోంది. పట్టణంతో పాటు గవరపాలెంలో కూడా దోమల బెడద అధికంగా ఉంది. దోమల వల్ల రోజు అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తున్నదని, సమస్యపై ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ మలేరియా విభాగం అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దోమ కాటు వల్ల ఎక్కడ వ్యాధులు సోకుతాయోనని ఆందోళనగా ఉందని కశింకోట అప్పారావు అనే వృద్ధుడు వాపోయాడు. సకాలంలో పన్నులు వసూలు చేసే అధికారులు, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా దోమల నివారణకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలు దోమల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఉడ్‌పేటలో అధ్వానంగా తయారైన కాలువ


పూల్‌బాగ్ నుంచి కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డులో మురికి కూపం

ఈ విషయమై జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తిని వివరణ కోరగా, దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. మలేరియా విభాగం అధికారులతో మాట్లాడి కాలువల్లో ఎప్పటికప్పుడు ఫినాయిల్ చల్లించడమే కాకుండా పారిశుధ్య విభాగం అధికారులతో మాట్లాడి కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

పిల్లల దత్తతపై అవగాహన అవసరం

▸▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి

తుమ్మపాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల దత్తతపై అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి సూచించారు. అనకాపల్లిలో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చట్టబద్ధంగా నెలల వయసు నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలను దత్తత తీసుకోవచ్చునన్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు మిషన్ వాత్సల్య వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దత్తతకు సంబంధించి ప్రస్తుత ఫ్యామిలీ ఫొటో, నివాస, ఆదాయ, వివాహ తదితర ధ్రువీకరణపత్రాలు అందించాల్సి ఉంటుందన్నారు. దత్తత తీసుకునే సమయంలో రూ.50 వేలు డీడీ రూపంలో చెల్లించాలని ఆమె తెలిపారు. రోడ్డు పక్కన, చెత్త కుండీలు, ముళ్ల పొదల్లో పడవేసిన శిశువులను గుర్తించిన తక్షణమే చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబరు (1098)కు సమాచారం అందించాలని డీఎంహెచ్‌వో కోరారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి పి.లక్ష్మి, శిశు గృహ మేనేజర్ శ్రీదేవి, సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పాశాలమ్మ పండుగ


పురవీధుల్లో అమ్మవారి ఘటాలు ఊరేగిస్తున్న భక్తులు

కశింకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామంలో పాశాలమ్మతల్లి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. మూడేళ్లకు ఒకసారి వచ్చే ఈ పండుగకు ఇతర జిల్లాల్లో ఉద్యోగరీత్యా స్థిరపడిన వారు, వివిధ పనుల కోసం వలస వెళ్లిన గ్రామస్థులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాహలంగా తీర్థ మహోత్సవం జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగిన భద్రతా చర్యలు చేపట్టారు.

చెరువులను పునరుద్ధరించాలని దీక్షలు


నిరాహార దీక్షలో పాల్గొన్న గ్రామస్థులు

కశింకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గైరమ్మ, కిట్టయ్య చెరువులను పునరుద్ధరించాలని గొబ్బూరు గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. గొబ్బూరు, గొబ్బూరుపాలెం, నర్సింగబిల్లి, తాళ్లపాలెం గ్రామాల నుంచి 70 మంది గ్రామస్థులు కంపెనీకి అతి చౌకగా తమ భూములు ధారాదత్తం చేశారని, కంపెనీలో ఇప్పటివరకు ఉద్యోగాలు కల్పించలేదని, దీనికితోడు చెరువులను ఆక్రమించి రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని తొలగించి చెరువులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని గ్రామస్థులకు న్యాయం చేయాలని కోరారు.

ఇళ్లపై చెట్ల కొమ్మలు తొలగింపు


ఇళ్ల పై చెట్టు కొమ్మలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భీమునిగుమ్మం పరిసర ప్రాంతాల్లో ఇళ్లపై ఉన్న చెట్టు కొమ్మలను జీవీఎంసీ అధికారులు తొలగించారు. భీమునిగుమ్మం వద్ద భారీ వృక్షం నుంచి కొమ్మలు ఇళ్లపైకి చేరడంతో పాటు అవి ఎక్కడ విరిగి ఇళ్ల దెబ్బతింటాయోనని కొంత మంది బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. జీవీఎంసీ పరిధిలోని ఐదు వార్డుల్లో ప్రజలు నుంచి సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం ప్రజాదర్బార్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రజాదర్బార్‌లో భాగంగా చెట్టుకొమ్మల వల్ల పడుతున్న ఇబ్బందులను ప్రజలు విన్నవించారు. జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్పందించి విశాఖపట్నం నుంచి సిబ్బందిని రప్పించి, ఉద్యానవన అధికారిణి ప్రియాంక ఆధ్వర్యంలో మంగళవారం చెట్టుకొమ్మలను తొలగించారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు


దత్త జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

సబ్బవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో దత్త జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు, దత్త, మహాలక్ష్మీ హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై రైతులకు శిక్షణ

కొత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూండ్రం గ్రామంలో భూసార పరీక్షలపై మంగళవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. భూసార పరీక్షలు చేయించుకుంటే కలిగే ఉపయోగాలను జిల్లా సహాయ వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం వివరించారు. మనిషికి రక్త పరీక్ష ఎంత అవసరమో, భూమికి కూడా పరీక్ష అంతే అవసరమని చెప్పారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు సమపాలలో వేసుకోవచ్చన్నారు. పంట కోతలు పూర్తయిన వెంటనే భూసార పరీక్షలు ప్రారంభమవుతున్నాయన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా మినుములు, పెసలు, వేరుశనగ విత్తనాలు రాయితీ ఇస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవిలో జీలుగ, జనుము, పీఎండీఎస్ విత్తనాలు చల్లుకొని నేలను అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవడం ద్వారా భూసారం పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి, సర్పంచ్ నందారపు లక్ష్మి, టీడీపీ నాయకులు నందారపు సూరిబాబు, మరపురెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

▸▸ పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

పరవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ సూచించారు. ఫార్మాసిటీలోని వసుధ ఫార్మా పరిశ్రమలో మంగళవారం సైబర్ నేరాలు-రోడ్డు భద్రతపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ మోసాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని చెప్పారు. అవగాహన ద్వారానే సైబర్ నేరాలను నిరోధించవచ్చునన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అనుమానాస్పద లింక్‌లు, యాప్‌లు, మెసేజ్‌ల జోలికి పోకూడదని డీఎస్పీ సూచించారు. వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆర్.మల్లికార్జునరావు, పరిశ్రమ ప్రతినిధులు కేవీఎస్ఎన్.రాజు, దీప్‌చంద్ ఉపాధ్యాయ కె.శ్రీనివాసరాజు, హర్ష, ఎస్ఆర్ శర్మ, జె.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: ఎన్టీపీసీ ఈడీ

లంకెలపాలెం (పరవాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సమీర్‌శర్మ పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యతలో భాగంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన రూరల్ స్పోర్ట్స్‌మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను చాటి చెప్పడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు సోదర భావంతో మెలిగి పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ పోటీలకు మండలంలోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు పెదగంట్యాడ మండలం ఇస్లాంపేట హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. బాలికలకు ఖోఖో, త్రోబాల్, కబడ్డీ, బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలతో పాటు బాలబాలికలకు 600 మీటర్లు, 800 మీటర్లు, పరుగు పోటీలు, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి హెచ్‌ఆర్ ఏజీఎం టీబీ పాత్ర, సీఎస్ఆర్ ప్రతినిధి కె.ప్రకాశరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ


పరుగు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వృథాగా తాగునీరు.. అధికారులు పట్టించుకోరు!


సైపునకు రంధ్రం ఏర్పడడంతో లీకైన తాగునీరు

ప్రధాన రహదారిపై వృథాగా పారుతున్న నీరు

పరవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌కు తాగునీటి సరఫరా చేసే పైప్‌లైన్‌కు మండల పరిషత్ వై.జంక్షన్ వద్ద రంధ్రం ఏర్పడటంతో నీరు వృథా అవుతోంది. ఏలేరు కాలువ నుంచి తాడి వద్ద గల ఏపీఐఐసీ పంప్‌హౌస్ ద్వారా సెజ్‌కు నీటి సరఫరా జరుగుతోంది. అయితే రెండేళ్లుగా మండల పరిషత్ వై. జంక్షన్ సమీపంలో భూమి అడుగు భాగాన పైప్‌లైన్‌కు రంధ్రం ఏర్పడటంతో పెద్ద ఎత్తున నీరు వృథాగా పోతోంది. ప్రధాన రహదారిపై నీరు పారుతూ సమీపంలోని గెడ్డలోకి చేరుతోంది. ఏళ్ల తరబడి నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేకపోయాడని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీఐఐసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి నెలకొందని మండిపడుతున్నారు. రెండేళ్లుగా నీరు వృథాగా పోతున్నా పట్టించుకోకుండా నిద్రమత్తులో ఉన్నారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో పాటు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు.

ప్రజారోగ్యంపై అప్రమత్తంగా ఉండండి


కార్యదర్శులు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో

కశింకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రజారోగ్యం పట్ల ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో తోటరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైద్యులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లులు, దోమల ద్వారా వచ్చే ఈ వైరస్ గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ చర్యలను తెలియజేయాలని ఆయన చెప్పారు. పంచాయతీల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉండేటట్టు పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధి బాధిత బాలికకు ఆర్థిక సాయం


బాలిక తల్లిదండ్రులకు విరాళం అందిస్తున్న దాతలు

సబ్బవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చీడికాడ మండలంలోని ఖండివరం గ్రామంలో కాలేయ వ్యాధితో బాధ పడుతున్న బాలికకు పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు. ఖండివరానికి చెందిన గేదెల గంగునాయుడు, హేమ దంపతుల 18 నెలల కుమార్తె కొన్ని నెలలుగా కాలేయ వ్యాధితో బాధ పడుతున్నది. ఆమె వైద్యానికి రూ.30 లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జోడుగుళ్ల ప్రాంతానికి చెందిన బంగారుతల్లి సేవా సమితి, గాజువాక ఆర్య ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు రూ.1.85 లక్షలను సమీకరించి బాలిక తల్లిదండ్రులకు అందించారు. దీంతో వారికి బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

స్టేజీ కార్యక్రమాలకు అనుమతులు తప్పనిసరి: డీఎస్పీ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఉత్సవాల సందర్భంగా స్టేజీ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు నిబంధనలు పాటించాలని డీఎస్పీ ఎం.శ్రావణి మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఉత్సవాల సందర్భంగా స్టేజీలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే రాత్రి పదిన్నర గంటలకు ముగించాలని సూచించారు. అలాగే స్టేజీ వద్ద సీసీటీవీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్టేజీకి ముందు వీక్షకులు పైకి రాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. స్టేజీకి సంబంధించి డయాస్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే ఆర్అండ్‌బీ, ఫైర్ సర్వీస్, విద్యుత్ శాఖల దగ్గర నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నియమాలు పాటించే వారికి మాత్రమే స్టేజీ కార్యక్రమాలకు అనుమతి ఇస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం

పరవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) పరవాడ మండల నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. అధ్యక్షురాలుగా కె.సుభాషిణిదేవి, ఉపాధ్యక్షులుగా జి.బంగార్రాజు, లిజిఫ్లోరెన్స్, గౌరవాధ్యక్షుడిగా బొడ్డు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జి. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా కర్రి బాల రాజారావు, కార్యదర్శిగా పి.నరేన్‌మూర్తి, కార్యవర్గసభ్యులుగా ఎం.ప్రకాశరావు, వి.అప్పారావు, పీఎంఎస్ విజయ ఎన్నికయ్యారు. యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లుగా వి.లక్ష్మి, ఎం.రామునాయుడు, యు.మనోరంజిని, జె.శాంతాదేవి, యూటీఎఫ్ సీపీఎస్ కన్వీనర్‌గా ఎస్.వరహాలబాబు, మహిళా కన్వీనర్‌గా ఆర్.ఉమాదేవిని ఎన్నుకున్నారు.

సీఐటీయూ సభలకు తరలిరండి

పరవాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించనున్న అఖిలభారత మహాసభలకు తరలిరావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడంతో పాటు భవిష్యత్తులో నిర్వహించే పోరాటాలకు రూపకల్పన జరుగుతుందని చెపారు. అసంఘటితరంగ కార్మికులు, స్కీమ్ వర్కర్లు మహాసభలకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మహిళా ప్రతినిధులు ఎస్.వెంకటలక్ష్మి, జి.వరలక్ష్మి, ఉమా, రమాదేవి, రమణమ్మ, భూలక్ష్మి, సిహెచ్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లోని 80వ వార్డు వల్లూరు గ్రామంలో గత ప్రభుత్వంలో నిర్మించిన సామాజిక భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని 80వ వార్డు వైసీపీ అధ్యక్షుడు కేఎం.నాయుడు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ ఏఈ వెంకటేశ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంపీ డాక్టర్ సత్యవతి నిధులు రూ.70 లక్షలతో భవనం నిర్మించారని, ఇది పూర్తయిన సమయంలో ఎన్నికలు రావడం వల్ల అందుబాటులోకి రాలేదని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి నిర్మాణం పూర్తయిన భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొణతాల మురళీకృష్ణ, విల్లూరి శివసూరి, గొల్లవిల్లి చిరంజీవి, సిమ్మా గోపాల్ పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కల్పించండి


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇది అంటువ్యాధి కాకపోయినా, వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గుల్లేపల్లి, సబ్బవరం పీహెచ్‌సీల వైద్యులు చక్రవర్తి, దామయంతి, జానప్రసన్న స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలు, నివారణ కోసం తీసుకోవాలసిన జాగ్రతలను వివరించారు. ఈ వ్యాధి సోకితే చలి జ్వరంతో పాటు తలనొప్పి, కండరాల నొప్పులు ఏర్పడతాయన్నారు. వ్యాధి తీవ్రత పెరగకముందే అవసరమైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో లలితకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.62 కోట్లతో ఆశ్రమ పాఠశాలల్లో వసతులు

» ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్



వైఎన్ పాకలు ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో

కొయ్యూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో 8 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మాణం, ఆర్వో ప్లాంట్‌లకు రూ 1. 62 కోట్లు మంజూరైనట్టు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం మం డలంలో వైఎన్ పాకలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఏటీడబ్ల్యూవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతి, అందిస్తున్న మెనూ తదితర విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కొయ్యూరు బాలురు-1కు 5 మరుగుదొడ్లు, 5 స్నానపు గదులు, నడింపాలెంకు 8 మరుగుదొడ్లు, 8 స్నానపు గదులు, డౌనూరుకు 5 మరుగుదొడ్లు, 5 స్నానపు గదులు, కొయ్యూరు ఆశ్రమ పాఠశాల-2కు 5 స్నానపు గదులు, చిట్టింపాడు 3 మరుగుదొడ్లు, 3 స్నానపు గదులు, శరభన్నపాలెంక 4 మరుగుదొడ్లు, 4 స్నానపు గదులు, పి. మాకవరంలో 3 మరుగుదొడ్లు, 3 స్నానపు గదులు, రావణాపల్లికు 12 మరుగుదొడ్లు, 12 స్నానపు గదులు, రాజేంద్రపాలెంకు 7 మరుగుదొడ్లు, 7 స్నానపు గదులు, కొమ్మిక 5 మరుగుదొడ్లు, 5 స్నానపు గదులు, వైఎన్ పాకలు 10 మరుగుదొడ్లు, 9 స్నానపు గదులు, మర్రిపాలెం మహిళ డిగ్రీ కళాశాల వసతి గృహానికి 8 మరుగుదొడ్లు, 8 స్నానపు గదులు మంజూరయ్యాయన్నారు. ఒక్కో మరుగుదొడ్డికి రూ. లక్ష, స్నానపు రూ. లక్ష వంతున నిధులు కేటాయించారన్నారు.మంప, కొయ్యూరు ఆ శ్రమ పాఠశాల-1, ఎం. భీమవరం, డౌనూరు, పి. మాకవరం, రావణాపల్లి, రాజేంద్రపాలెం, వైఎన్ పాకలు పాఠశాలకు ఆర్వో ప్లాంట్‌లు మంజూరైనట్టు, వీటికి ఒకొక్క దానికి రూ 2.75 లక్షలు కేటాయించారన్నారు.

12 వాహనాలపై కేసుల నమోదు: మూడు జీపులు సీజ్



వాహన రికార్డులు పరిశీలిస్తున్న ఏఎంవీఐ సాయిరమేశ్

పాడేరురూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వాహన ప్రమాదాలు నివారణకు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జిల్లా రవాణాధికారి కేవీ.ప్రకాశరావు ఆదేశాల మేరకు గత వారం రోజులుగా విస్తృతంగా వాహన తనిఖీలను చేపట్టినట్టు జిల్లా ఏఎంవీఐ సీహెచ్.సాయి రమేశ్ తెలిపారు. పాడేరు పరిసర ప్రాంతంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 12 జీపులకు రూ. 80, 330 చలానా విధించామన్నారు. అధిక ధరలు, పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని మూడు జీపులను సీజ్ చేసి పాడేరు ఆర్టీసీ డిపోనకు తరలించినట్టు చెప్పారు. వాహన దారులు పూర్తి స్థాయిలో రికార్డులతో వాహనాలను నడపాలని, అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేసినా, పరిమితికి మించి ప్రయాణికులను తరలించినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రోడ్డు మధ్యలో గొయ్యి పూడ్చివేత

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద రహదారికి సిమెంట్ తూరలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొయ్యూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద అటవీ కలప డిపోనకు సమీపాన కాకరపాడు- కొయ్యూరు మధ్య ప్రధాన రహదారిపై కల్వర్ట్‌పై మంగళవారం కొత్తగా సిమెంట్ తూరలు ఏర్పాటు చేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఆదమరిస్తే.... అంతే ' పేరున ప్రచురితమైన వార్తా కథనానికి ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి ఈ మేరకు చర్యలు చేపట్టారు. ములకలపాడు చెక్‌డ్యామ్ నుంచి రోడ్డు ఇవతల పొలాలకు నీరు వెళ్లేలా ప్రధాన రహదారి మధ్యలో నిర్మించిన కల్వర్టు పైపులు శిథిలంకావడంతో గొయ్యిపడి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకు రావటంతో మంగళవారం కొత్త పైపులు వేసి కల్వర్టు నిర్మించారు. దీంతో ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

సీలేరులో స్వచ్ఛభారత్



శివాలయం వద్ద పరిశుభ్రం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

సీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ కేఎన్ కృష్ణన్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయం, గెస్తేమనే చర్చి, రామాలయం, మారెమ్మ ఆలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోస్టాఫీస్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

ప్రయాణ కష్టాలు

» అధ్వానంగా చిమిలిగుడ- రూడి రహదారి
» రాకపోకలకు గిరిజనుల అవస్థలు

హుకుంపేట డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి); మండలంలోని రంగశీల పంచాయతీ పరిధి చిమిలిగుడ గ్రామ సమీపం నుంచి పాతకోట పంచాయతీ రూడి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు అడుగడుగునా కోతకు గురైంది. రాళ్లు తేలాయి. గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సుమారుగా 10 కిలో మీటర్ల దూరం వరకు కొండల నుంచి చిన్నపిల్లలతో రంగశీల వచ్చి వాహన ప్రయాణాలు సాగించాల్సి రావడంతో వ్యవప్రయాసకు లోనవుతున్నట్టు గ్రామసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తిరిగి తమ గ్రామనికి నిత్యావసర సరకులు, పిల్లలతో కొండ ఎక్కి ప్రయాణం సాగించాల్సి వస్తోందని తెలిపారు. గతంలో టీడీపీ హయాంలో ఈ రోడ్డు మంజూరైందని, అంతరంగ్రావెల్ వేశారన్నారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు జరగలేదని రూడి గ్రామస్థులు చెబుతున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తి కాపోవడంతో 104 108 వాహన సేవలు కూడాను పొందలేక పోతున్నామన్నారు. పీటీజీ గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ప్రకటనలు చేయటమే ఫలితం ఉండడంలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం లోనైనా ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.



కోతకు గురైన మట్టి రహదారి

ఆస్పత్రిలో ప్రసవం సురక్షితం: డీసీహెచ్‌ఎస్



గర్భిణులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం. నీలవేణి

చింతపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవం పొందడం సురక్షితమని జిల్లా ఆస్పత్రుల సేవలు సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ ఎం. నీలవేణి అన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 190 మంది గర్భిణులకు స్త్రీ వైద్యనిపుణులు సబ్బవరపు వాసవి, ఒండ్రు శ్రీలతలు వైద్యపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ గర్భిణులతో మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో ఒక్కసారైన స్కానింగ్ చేయించుకోవాలన్నారు. దీని వల్ల ప్రమాదకరమైన ప్రసవాలను ముందుగా గుర్తించవచ్చునన్నారు. గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ పోషకాహారం తీసుకోవాలన్నారు. పురిటినొప్పులు ప్రారంభమైన తరువాత ఆస్పత్రికి తరలించడం కంటే గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం పొందడం వల్ల మాత, శిశు మరణాలను నియంత్రించవచ్చునన్నారు. గర్భిణులకు వసతి గృహంలో పూర్తి స్థాయి సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గర్భిణులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు వివరించారు. గృహాల్లో ప్రసవం పొందడం తల్లి, బిడ్డ ఆరోగ్యానికి సురక్షితం కాదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

కరాటే పోటీలో విద్యార్థినులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

కొయ్యూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో పి. మాకవరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు నాలుగు వెండి పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 7 న అనపర్తి కేంద్రంగా రాణి రుద్రమదేవీ సెల్ఫ్ డిఫెన్సు అకాడమి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ఆశ్రమ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న సోమెల కీర్తి, లోచెల రాజ్యలక్ష్మి, దేవరాజు దుర్గా, నాగలక్ష్మి అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల హెచ్‌ఎం సంధ్య, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, డిప్యూటీ వార్డెన్ పద్మతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాల్సిందే: డీఎస్పీ



ప్రైవేటు జీపు డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ షహబాజ్

పాడేరురూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ప్రైవేటు జీపు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. జీపు డ్రైవర్లు అంతా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డులు మొత్తం వాహనంలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించ వద్దని, జనాల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అధిక మొత్తంలో చార్జీలను వసూలు చేయరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు, ఎస్ఐ ఎల్.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పాల్ డా.భరత్‌కుమార్‌నాయక్

అరకులోయ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. అతిథిగా హాజరైన మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్‌లకు ప్రోత్సాహం అందిస్తూ సఖ్యతతో మెలగాలన్నారు. సీపీడీసీ మెంబర్ రామరాజు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆశయాలకు అనుగుణంగా ఎదగాలన్నారు. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. సీనియర్ విద్యార్థులంతాజానియర్సను ఆహ్వానించారు. అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది, వార్డెన్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



సినిమా పాటలకు డ్యాన్స్ వేస్తున్న విద్యార్థులు

డిజిటల్ కేంద్రాలుగా శాఖా గ్రంథాలయాలు

» ఉమ్మడి జిల్లా విశాఖ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు



రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి కుమార్‌రాజు

డుంబ్రిగుడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పూర్తిస్థాయి భవనాలు ఉన్న గ్రంథాలయాలను డిజిటల్ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించనున్నామని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయ సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన యువత, విద్యార్థుల పోటీ ప్రపంచానికి తీర్చిదిద్దేలా పుస్తకాలు ఉన్నాయన్నారు. గ్రంథాలయాలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అసోసియేషన్ యూనియన్ నాయకులు ఆనందరావు, రమణ, గ్రంథాలయ అధికారిణి సునీత, సిబ్బంది సుబ్బారావు పాల్గొన్నారు.

13, 14న ఉపాధ్యాయుల డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

పాడేరురూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 13, 14వ తేదీలలో ఉపాధ్యాయుల డివిజన్‌స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి పాటోజు బ్రహ్మాజీరావు తెలిపారు. పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు డీఈవో, డివిజన్‌లో ఉన్న ఎంఈవో-1, ఎంఈవో-2, ఎస్‌జీఎఫ్ డివిజనల్ కో-ఆర్డినేటర్లు కన్వీనర్‌లుగా వ్యవహరిస్తూ పోటీల విజయవంతానికి కృషి చేయాలని కోరారు. డివిజన్ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడా బృందాలను జిల్లా స్థాయి పంపిస్తామన్నారు.

పాఠశాలల్లో మెనూ ఉల్లంఘిస్తే చర్యలు



భోజనాలను పరిశీలించి రుచి చూస్తున్న ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి

చింతపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక ఏటీడబ్ల్యూవో బి. జయ నాగలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల-1ని ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాలను నాణ్యత, రుచిని పరిశీలించారు. అనంతరం ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలకు ప్రభుత్వం నిర్దేశించి మెనూ ఆధారంగా భోజనాలు, అల్పాహారం విద్యార్థులకు పెట్టాలన్నారు.ఎట్టి పరిస్థితిల్లోనూ మెనూని ఉల్లంఘించరాదన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు కనిస్తే వెంటనే ఆస్పత్రికి తీసుకొని వెళ్లి చికిత్స అందించాలన్నారు. అవసరమైతే మైదాన ప్రాంతాలకు తీసుకొని వెళ్లి మెరుగైన చికిత్స అందించాలన్నారు. పదోతరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. సూపర్ 50 విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. వెనుకబడివున్న విద్యార్థులకు అదనపు తరగతులను బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాగిన రామరాజు పడాల్, హెచ్‌డబ్ల్యూవో ఎన్‌ఎస్‌ఎస్ రావు, పీడీ కంకిపాటి రామకృష్ణ పాల్గొన్నారు.

అందుబాటులోకి తాగునీటి పథకం



దొడ్డికొండలో బోరు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామనాపల్లి పంచాయతీ దొడ్డికొండలో తాగునీటి పథకాన్ని పంచాయతీ అధికారులు వినియోగంలోకి తీసుకొచ్చారు. గ్రామంలో నెల రోజు క్రితం ఈ పథకం మరమ్మతులకు గురైంది. దీంతో స్థానిక గిరిజనులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈస్థితిలో స్థానిక సర్పంచ్ కుందరి రామకృష్ణ నీటి పథకం మరమ్మతులు చేయించారు. దీంతో గిరిజనుల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యవర్గం

పాడేరురూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా రెండవ మహాసభలు సందర్భంగా రెండవ రోజు మంగళవారం జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక చేసినట్టు రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ తెలిపారు. అధ్యక్షుడిగా పాంగి జీవన కృష్ణ, కార్యదర్శిగా కొర్రా కార్తీక్, ఉపాధ్యక్షుడిగా పాంగి సింహాద్రి, జాయింట్ సెక్రటరీగా పాంగి చిన్నారావు, జిల్లా కమిటీ సభ్యులుగా ఐ సుబాబు, శైలు, సునందిని, ప్రభాస్, దిలీప్, ప్రేమ్, మ ణి, భాస్కర్, కిశోర్, స్వామి, పురిస్తాన్, అతిరామ్ తదితరులు ఎంపిక చేసినట్టు చెప్పారు.

టీడీపీ బలోపేతానికి కృషి

» పరిశీలకుడు వెంకటసురేశ్‌కుమార్



బూత్ ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న పరిశీలకుడు సురేశ్

పెదబయలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అతి తక్కువగా ఓట్లు పోల్ అయినా బూత్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల ఆపార్టీ పరిశీలకులు కోడా వెంకట సురేశ్‌కుమార్ పార్టీ శ్రేణులు సూచించారు. మంగళవారం ఆయన తన బృందంతో పెదబయలు మండలంలో పర్యటించారు. ఎంపిక చేసిన బూత్‌లను విస్తృతంగా పరిశీలించారు. ఈ సర్వే అనంతరం పార్టీ అధిష్ఠానానికి నివేదిక పంపనున్నట్టు వారు పేర్కొన్నారు. అధిష్ఠానం తనకు ఈ బాధ్యతలు ఇచ్చినందుకు పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణుల సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులు విజయానికి కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీల ఖ్యాతిని చాటిన కరుణకుమారి



కరుణకుమారిని పుష్పగుచ్ఛమందిస్తున్న ఎస్టీ కమిటీ మెంబర్, టీడీపీ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంధుల మహిళా టీ-20 క్రికెట్ వరల్డ్ కప్ విజేత పాంగి కరుణకుమారిని ఆమె స్వగ్రామం వంట్లమామిడిలో ఎస్టీ కమిటీ సభ్యుడు కిల్లో సాయిరాం మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరుణ కుమారి ఇటీవల జరిగిన అండర్-19 టీ-20 పోటీల్లో పాల్గొని కీలకదశలో 43 పరుగులు సాధించి జట్టు విజయానికి కృషి చేసి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఆదివాసీ ముద్దు బిడ్డగా విజయకేతనం ఎగురవేసి ఖ్యాతిని చాటారన్నారు. ఈ సందర్భంగా కరుణ కుమారికి సాలువా కప్పి పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తు భారత క్రికెట్ జట్టులో ప్రాతినిధ్యం వహించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వా మి, టీడీపీ నాయకులు పూర్ణ, అచ్చిబాబు, రమేశ్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో పర్యావరణాన్ని పరిరక్షించాలి



వంజంగిలో అవగాహన ర్యాలీ చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ బృందం

పాడేరురూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రాల వద్ద పర్యావరణం పరిరక్షించాలని పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎస్.రసూల్ పిలుపునిచ్చారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం దత్తత గ్రామమైన లగిశపల్లిలో సేవా శిబిరం ముగింపు సందర్భంగా మంగళవారం వంజంగి పర్యాటక ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా టూరిజం రిసార్ట్‌ని సందర్శించి ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలని యాజమాన్యానికి కోరారు. అనంతరం వంజంగిలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సేకరించి క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. లగిశపల్లి సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. వారం రోజులుగా వివిధ రకాల నైపుణ్యాలు, ప్రభుత్వ పథకాలు ప్రచారం, సేవా కార్యక్రమాలను చేపట్టిన వలంటీర్లను ఆయన అభినందించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన గ్రామ మహిళలు, యువతకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ ఎల్.పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఎల్.రామకృష్ణపాత్రుడు, సచివాలయ సెక్రటరీ విజయ్, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, పీవోలు డాక్టర్.వి.రమేశ్‌బాబు, డాక్టర్.డి.సునీత, ఎం.రాధాకుమారి, ఈవీ.జయలక్ష్మి, వారిజ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ముఖ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు

కొయ్యూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల్లో కార్యకలాపాలు, ఆదాయ వ్యయాలు, అవినీతి, అక్రమాలు వెలుగులోకి తెచ్చేందుకు వీలుగా ఉపకరించే సమాచార హక్కు చట్టంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కార్యాలయ ఏవో బాల మురళి పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఏవో ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో చట్టంతో కలిగే లాభాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

ప్రకృతి సాగు పెంపునకు ప్రోత్సాహం: ఏవో



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో, సాధికార సంస్థ ప్రతినిధులు

జి.మాడుగుల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచే లక్ష్యంగా విత్తనాలను పంపిణీ చేస్తునట్లు వ్యవసాయ అధికారి వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ప్రకృతి వ్యవసాయం చేపట్టే రైతులకు మినుములు, వేరు శనగా విత్తనాలు, వీటిలో పాటు వివిధ మొక్కలు అందజేశారు. రెండవ పంట రబీకి సేంద్రియ ఎరువులు తయారు విధానంపై రైతులకు సూచనలు చేస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన్యమిస్తున్నట్టు రైతులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సాధికార మండల యూనిటీ ఇన్‌చార్జీ ఎం.ప్రసాద్, వ్యవసాయయ శాఖ సిబ్బంది ఉదయ్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు, క్షయ రోగులను సకాలంలో గుర్తించాలి



రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీస్తున్న జిల్లా అధికారి కిరణ్ కుమార్

ముంచంగిపుట్టు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్షయ, కుష్ఠు వ్యాధులను ముందుగానే గుర్తించి వ్యాధిగ్రస్థులకు సకాలంలో సంపూర్ణ వైద్య సేవలు అందించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక సీహెచ్‌సీతో పాటు లబ్బూరు పీహెచ్‌సీలను ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. సీహెచ్‌సీలో క్షయ నిర్ధారణ పరీక్షలు ఎలా జరుగుతున్నాయో తనిఖీ చేశారు. అనంతరం లబ్బూరు పీహెచ్‌సీని సందర్శించి వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. నమోదవుతున్న కేసులు, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని తనిఖీ చేశారు. అత్యవసర మందులు నిత్యం అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాదు, ఆరోగ్య విస్తరణ అధికారి సంజీవ్, హెల్త్ విజిటర్లు సీతారామరాజు, కాసులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సీలేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ బూసుకొండలో మంగళవారం సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దత్తత గ్రామం కావడంతో సీలేరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొని 48 మంది గిరిజనులకు వైద్య పరీక్షలను చేశారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎన్. త్రినాథ్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎకనామిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ బోధించడానికి ఫ్యాకల్టీ కావాలని చెప్పారు. ఎకనామిక్స్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంఏ ఎకనామిక్స్‌లో 55 శాతం, జువాలజీ బోధించడానికి ఎంఎస్సీ జువాలజీలో 55 శాతం, బీఎస్సీ కెమిస్ట్రీ బోధించడానికి ఎంఎస్సీ కెమిస్ట్రీలో 55 శాతం చొప్పున మార్కులు కలిగి ఉండాలని ఆయన తెలిపారు. నెట్, ఏపీ సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కళాశాలలో శుక్రవారం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష ఫీజుల చెల్లింపు

మాకవరపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 608 మంది విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజులను జ్యోతిరావుపూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ తరపున చెల్లించామని సంస్థ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోతల ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థుల పరీక్ష ఫీజులు చెల్లించడంతో పాటు ఒక్కొక్క ఉన్నత పాఠశాల నుంచి టాప్ ఫైవ్‌లో నిలిచిన ఐదుగురు విద్యార్థులకు వారికి ఇష్టమైన కళాశాలలో ఇంటర్ చదువుకోవడానికి ఫీజులు చెల్లిస్తామని ఆయన తెలిపారు.

12న అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 12న అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నర్సీపట్నం ఈ మేరకు ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ తరపున వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. అంగన్‌వాడీలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ఏఎస్‌ఐ కుటుంబానికి ఆర్థిక సాయం

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలోని సీలేరు పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ మరణించిన నర్సీపట్నం ప్రాంతానికి చెందిన టి.బుజ్జి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించామని శక్తి పోలీసు అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 1990లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన 222 మంది ప్రస్తుతం ఏఎస్‌ఐలుగా పని చేస్తున్నారని చెప్పారు. వీరంతా శక్తి పోలీస్ అసోసియేషన్‌గా ఏర్పడి బ్యాచ్‌లో ఎవరైనా మరణిస్తే రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తున్నామని అధ్యక్షుడు అనిల్, కోశాధికారి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులు కృష్ణమూర్తి, పూర్ణచంద్రరావు తెలిపారు.

పిల్లల దత్తతపై అవగాహన అవసరం

▸▸ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతి

తుమ్మపాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల దత్తతపై అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి చెప్పారు. అనకాపల్లిలో మంగళవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు మిషన్ వాత్సల్య వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దత్తతకు సంబంధించి ప్రస్తుత ఫ్యామిలీ ఫొటో, నివాస, ఆదాయ, వివాహ తదితర ధ్రువీకరణపత్రాలు అందించాల్సి ఉంటుందన్నారు. దత్తత తీసుకునే సమయంలో రూ.50 వేలు డీడీ రూపంలో చెల్లించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి పి.లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలపై సభ్యుల గరం గరం

▸▸ వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ... (ఇన్‌సెట్‌లో) సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధులు

గొలుగొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా సమస్యలపై సభ్యులు మండిపడ్డారు. ప్రతీ సమావేశంలో అధికారులకు తెలుపుతున్నా పరిస్థితి యథాతథంగానే ఉంటున్నదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నాగాపురం సర్పంచ్ రఘు రామరాజు మాట్లాడుతూ గ్రామాల్లో పింఛన్లకు అర్హులను గుర్తించి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పలు గ్రామాల్లో జల్‌జీవన్ పథకం కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. అలాగే ఇంటింటికీ తాగునీరు అందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన చేపట్టాలని గాదంపాలెం సర్పంచ్ శ్రీను డిమాండ్ చేశారు. ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగా ఉన్నాయని, కోతల సమయంలో ఉపాధి పథకం నిలిపివేయాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీల విభజనకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. దీనికి సంబంధించి దరఖాస్తులు తమకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు, నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు చికెల సాంబమూర్తి, వైస్ ఎంపీపీలు నాగమణి, ఆదినారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గిడుతూరులో అకడమిక్ ఫోరం పర్యటన

మాకవరపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిడుతూరు మోడల్ ప్రాథమిక పాఠశాలను అకడమిక్ ఫోరం ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. ఎంఈవో పీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఈ బృందం ఉదయం 9 గంటలకు పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల హ్యాండ్ పుస్తకాలు, విద్యార్థుల రాత పుస్తకాలు, ప్రోగ్రెస్ కార్డులు, సిలబస్ తదితర అంశాలపై ఆరా తీశారు. ఇవి ఎంత వరకు పూర్తి చేశారని ప్రశ్నించారు. అలాగే నో బ్యాగ్ డే కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాబ్జీరావు, సబ్జెక్టు నిపుణులు కోసూరు రాము, అప్పలాచార్యులు, బాలాజీ, రమేశ్, సంతోషి, సీఆర్పీలు రామచంద్ర, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో చలానా కేసుల పరిష్కారం

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల వాహనాలపై ఉన్న ట్రాఫిక్ చలానా కేసులను ఈ నెల 13న నర్సీపట్నం కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పించినట్టు పట్టణ సీఐ ఎస్‌కే గఫూర్ తెలిపారు. నర్సీపట్నం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి రోహిత్ పోలీసు శాఖతో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారని చెప్పారు. ఈ అవకాశాన్ని వాహన చోదకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో తడి, పొడి చెత్తపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుపై ఎంపీడీవో ఉషశ్రీ విచారణ చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో ఆమె మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా క్లాప్‌మిత్రలు ఇంటి వద్దకు వచ్చినప్పుడు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజాల నాగరత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం శారదా నగర్‌లో మంగళవారం గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. వంద మంది గర్భిణులకు ఆహారం అందించినట్టు కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్మసీ సూపరింటెండెంట్ కనకరాజు, నర్సులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి: సీఐ



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ గఫూర్

నర్సీపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ గఫూర్ కోరారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం ఆటో డ్రైవర్లతో ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన స్టాండ్ల వద్ద మాత్రమే వాహనాలు నిలపాలని, రోడ్డు మధ్య, కూడళ్ల వద్ద ఆటోలు ఆపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ప్రయాణికులను ఎక్కించేటప్పుడు, దింపేటప్పుడు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసుకోవాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం నేరమన్నారు. ముందు సీటులో పాసింజర్లను కుర్చోబెట్టుకోవద్దని స్పష్టం చేశారు. తప్పనిసరిగా వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని, యూనిఫారం ధరించాలని చెప్పారు. ప్రజల భద్రత కోసం ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ రమేశ్, ట్రాఫిక్ ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య కేంద్రంలో సిబ్బంది కొరత

నాతవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రాన్ని సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఆరు నెలల నుంచి డాక్టర్, సిబ్బంది లేకపోవడంతో పశువులకు సరైన వైద్య సేవలు అందక ఇబ్బంది పడుతున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో డాక్టరు, వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ ఉండడంతో చుట్టుపక్కల గ్రామాల పశువులకు సకాలంలో వైద్య సేవలు అందేవి. ఆరు నెలల క్రితం ఇక్కడ పశువైద్య కేంద్రంలో పనిచేసే వెటర్నరీ డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ అందరూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో నాతవరం పశువైద్య కేంద్రం నెల రోజుల పాటు మూతపడింది. ఫలితంగా పశు వైద్య కేంద్రం మూతపడడంతో పశువులకు వైద్యసేవలు అందక పాడిరైతులు ఇబ్బంది పడుతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో జిల్లా వెటర్నరీ అధికారులు స్పందించి గుమ్మిడిగొండ, సరుగుడు, వైడీపేట గ్రామ సచివాలయాలకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్‌లకు రెండేసి రోజుల చొప్పున నియమించారు. ఎంతకాలం ఇలా నాతవరం పశువైద్యకేంద్రాన్ని సిబ్బంది లేకుండా కొనసాగిస్తారని, వెంటనే వైద్యులతో పాటు సిబ్బందిని నియమించాని వారు విజ్ఞప్తి చేశారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత మేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 30వ తేదీన వైకుంఠ ఏకాదశికి, స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని, వచ్చే నెల 13వ తేదీన గోదాదేవి కల్యాణం, 14న గరుడోత్సవం నిర్వహిస్తామన్నారు.

బీఎన్ రోడ్డు పనుల పూర్తికి చర్యలు చేపట్టండి

▸▸ ఎమ్మెల్యేకు ఆమ్ ఆద్మీ పార్టీ నేతల వినతి

చోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డు పరిధిలోని తారురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనందున వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చూడాలని జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్‌బాబు, చోడవరం నాయకులు వేగి మహలక్ష్మినాయుడు విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా ఈ పనులు ప్రారంభించి, ప్రజల కష్టాలు తొలగించాలని కోరారు.

కొత్తకోటలో న్యూమోనియాపై అవగాహన ర్యాలీ

రావికమతం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సురేఖ ఆధ్వర్యంలో మంగళవారం న్యూమోనియా వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ మాట్లాడుతూ, న్యూమోనియా వ్యాధి ఎక్కువ శాతం చిన్న పిల్లలకు వచ్చే అవకాశం ఉందన్నారు. తల్లి పాలు పట్టని బిడ్డలకు, పోషకాహారం లోపం ఉన్న వారు, చేతులు సక్రమంగా శుభ్రపరుచుకోకపోవడం, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలకు ఎక్కువ ఈ వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. పోషకాహారం ఇవ్వడం ద్వారానే ఈ వ్యాధి రాకుండా చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

మాడుగుల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాడుగులలో మంగళవారం ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక సెయింటన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు బీమరశెట్టి భవాని, పైడియ్యానాయుడు, కార్యకర్తలు యేసురాజు, రాంబాబు, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీకి వెళ్లే మార్గంలో చెత్త



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మాడుగుల రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాడుగుల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జ్యుడిషియల్ కోర్టు, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు మార్గంలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ప్రాంతంలోనే తాగునీరు సరఫరా చేసే పైపులైను లీకేజీతో అక్కడ పారిశుధ్యం లోపించింది. అంతే కాకుండా అదే ప్రాంతంలో చెత్తా చెదారాన్ని అక్కడ పడేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ఆప్రాంత వాసుల కోరారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా రమేశ్



మండల అధ్యక్ష, కార్యదర్శులతో యాదవ సంఘం నేతలు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాదవ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా వడ్డాదికి చెందిన సింగంపల్లి రమేశ్ రెండోసారి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు భరిణకాన సాయినాథరావు ఆధ్వర్యంలో మంగళవారం బుచ్చెయ్యపేటలో యాదవ సంఘం సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు గోకివాడ కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, దేవర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బి.కింతాడలో వేరుశనగ విత్తనాల పంపిణీ

దేవరాపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడలో రైతులకు వేరుశనగ విత్తనాలను కూటమి నాయకులు మంగళవారం పంపిణీ చేశారు. వరి కోతలు అనంతరం రైతులు పెసర, మినుము, వేరుశనగ పంటలను వేస్తారు. నియోజకవర్గ ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిం నాగేశ్వరరావు, కొమార బాబూరావు, గొర్రెపల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

రోలుగుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల స్థలాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ నాగమ్మ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల్లో అర్హులై ఉండి ఇళ్ల స్థలాలు కావాల్సిన వారు తమ ఆధార్, రేషన్ కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటోను గ్రామ సచివాలయాల్లో అందిస్తే సరిపోతుందన్నారు.

పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సత్యారావు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో దిబ్బిడి హైస్కూల్‌లో క్లస్టర్ పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు కె.సత్యారావు తెలిపారు. దిబ్బిడి క్లస్టర్ పరిధిలోని 15 పాఠశాలలకు వాలీబాల్‌లు, నెట్‌లు, క్రికెట్ బ్యాట్‌లు తదితర వస్తువులతో కూడిన కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ జి.శ్రీను, పీడీ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రేషన్ డిపోల్లో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి తనిఖీ



రేషన్ డిపోలో తనిఖీ చేస్తున్న కేపీఎల్ఎన్ మూర్తి

చోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని రేషన్ డిపోలలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కేపీఎల్ఎన్ మూర్తి మంగళవారం తనిఖీ చేశారు. స్థానిక 1, 8, 16 నంబర్ల డిపోలతో పాటు గాంధీ గ్రామం పంచాయతీలోని రేషన్ డిపోలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్‌తో పాటు బియ్యం, పంచదార నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. డిపోలలో సరుకుల పంపిణీ సక్రమంగా నిర్వహించడంతో పాటు, రికార్డుల నిర్వహణ సరిగా ఉండాలని డీలర్లకు మూర్తి సూచించారు.

గుడివాడ కేంద్రంగా పంచాయతీ ఏర్పాటుచేయాలి



ఎంపీడీవోకి వినతిపత్రం అందజేస్తున్న కోనాం గిరిజన నాయకులు

చీడికాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోనాం పంచాయతీలో ఉన్న ఎనిమిది గిరిజన గ్రామాలను విడదీసి గుడివాడ కేంద్రంగా పంచాయతీ ఏర్పాటుచేయాలని స్థానిక ఎంపీడీవో హేమసుందరరావుకి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి, స్థానిక గిరిజన సంఘం నాయకులు గాలి సన్యాసిరావు, దుప్పి దాసు, కుంచుల ఈశ్వరరావు, చలుగు దేముడు, దుక్కి దాసు, చలుగు దేముడు, గాలి దయారావు ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. కోనాం పంచాయతీలో 14 గ్రామాలున్నాయని, వీటిలో ఏజెన్సీని ఆనుకొని ఉన్న గుడివాడ, జాజులపాలెం, వాకపల్లి, పనసగెడ్డ, మల్లిపాడు, చెరకుపల్లి, గొడుగుమామిడి, రెల్లలపాలెం గిరిజన గ్రామాలున్నాయన్నారు. ఈ ఎనిమిది గ్రామాల్లో సుమారు 650 ఓట్లు ఉన్నాయన్నారు. గుడివాడ కేంద్రంగా ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేసి, పాడేరు మండలంలో కలపాలని వారు కోరారు

ఘనంగా మోదకొండమ్మ ఆలయంలో పూజలు

మాడుగుల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మోదకొండమ్మ ఆలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ ప్రారంభం

రోలుగుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొవ్వూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు హెచ్‌ఎం పద్మజ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బాలికలు తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా వారిలో ఆత్మవిశ్వాసం పెంచడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై హెల్ప్‌లైన్లకు సమాచారమివ్వండి

▸▸ ఐసీడీఎస్ లీగల్ కం ప్రొఫెసరీ అధికారిణి రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న బి.రమాదేవి

చోడవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్టు తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, లేదా 181, 112, 100లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఐసీడీఎస్ లీగల్ కం ప్రొఫెసరీ అధికారిణి బి. రమాదేవి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని ముద్దుర్తి జెడ్పీ హైస్కూల్‌లో బాల వివాహ ముక్తభారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, ఆడపిల్లలను చదివించాలని, వారికి చదువుకు దూరం చేయవద్దని కోరారు. తొలుత ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కాలేజీలు, రెండో విడతలో హిందూ ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. మూడో విడతలో గ్రామాల్లోని నాయకులు, స్థానిక ఉద్యోగులతో అవగాహన సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పి.మంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడలో..

గ్రామాల్లో బాల్యవివాహాల నిరోధానికి అందరూ బాధ్యత తీసుకోవాలని మాడుగుల ఐసీడీఎస్ పీవో ఎర్రయ్యమ్మ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం మానవహారంగా ఏర్పడి బాల్యవివాహాల నిరోధానికి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమసుందరరావు, వైద్యాధికారులు సునీల్, కిలపర్తి ఉషాచైతన్య, ఎంఈవో కె.బొంజుబాబు, డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు, ఏపీఎం కనకమ్మ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



రావికమతం: సమావేశంలో మాట్లాడుతున్న కొత్తకోట వైద్యాధికారిణి సురేఖ



చీడికాడ: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, అంగన్‌వాడీలు

రావికమతం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై గ్రామాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఈ లక్షణాలు కనిపించి వారిని తక్షణమే సమీప ఆసుపత్రికి తీసుకురావాలని కొత్తకోట, రావికమతం పీహెచ్‌సీల వైద్యాధికారిణిలు సురేఖ, నళిని పుష్పలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మహేశ్ అధ్యక్షతన ఈ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ డాక్టర్లు మాట్లాడుతూ, ఈ వ్యాధి లక్షణాలు, నివారణ గురించి అవగాహన సమావేశంలో వివరించారు. ఈ వ్యాధి లక్షణాలు జ్వరం తీవ్రంగా రావడం, తీవ్ర తలనొప్పి, శరీరంపై దద్దుర్లు, కండ్ల కలక, లార్వా కుట్టిన చోట చర్మంపై నల్లటి పెచ్చులతో కూడి ఉంటుందన్నారు. ఇది ఒక్కరి నుంచి మరొకరికి వ్యాపించదన్నారు. ఈ వ్యాధిని ప్రభుత్వ ఆసుపత్రులలోనే నిర్ధారణ చేసే వీలుందన్నారు. సకాలం గుర్తించి వైద్యం పొందితే సులభంగా తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు లింగమూర్తి, బ్రహ్మాజీ, వైద్యసచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

స్క్రబ్ టైఫస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో విద్య, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, వైద్యారోగ్య, వెలుగు తదితర శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో స్క్రబ్ టైఫస్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి హామీ పథకం కార్మికులు, సచివాలయం ఉద్యోగులు, వెలుగు ఎస్‌హెచ్‌జీల ద్వారా అందరికీ ఈ కాంటాక్ట్ ఇన్ఫెక్షన్, రోగ నిర్ధారణ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో చౌడువాడ, లంకవానిపాలెం పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ రామ్‌చరణ్, డాక్టర్ శశిప్రియాంక స్క్రబ్ టైఫస్ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రమణి, ఎంఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో..

స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చీడికాడ, పెదగోగాడ వైద్యాధికారులు సునీల్‌కుమార్, చైతన్య మాట్లాడుతూ, ఎవరికైనా చలితో కూడిన జ్వరం, విపరీతమైన తలనొప్పి, అలసట, వంటిలో రేష్ వంటి లక్షణాలు ఉంటే ఆర్ఎంపీ వైద్యుల వద్దకు వెళ్లకుండా సబ్‌సెంటర్ వైద్య సిబ్బందికి గాని, పీహెచ్‌సీలో గాని చూపినట్టయితే వైద్యం అందజేస్తామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. సదస్సులో ఐసీడీఎస్ పీవో ఎర్రయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, అంగన్‌వాడీ, ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం : పలువురికి గాయాలు



గాయాలు చూపుతున్న బాధితురాలు

మాడుగుల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాడుగులలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా వెళ్లేవారిపై దాడికి తెగబడుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కుక్కలు విద్యార్థులు, మహిళలపై దాడి చేస్తున్నాయి. మంగళవారం స్థానిక దొరలవీధి, కోమట వీధిలో కుక్కలు స్వైరవిహారం చేశాయి. గ్రామానికి చెందిన జాగాని వెంకన్నబాబు, జి కొండమ్మ, వై.నాగరాజు, పి.అనురాధతో పాటు మరి కొంత మందిపై కుక్కలు దాడి చేశాయి. వీరంతా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. మండల కేంద్రంలో వీధి కుక్కలను ఏరివేయాలని పలువురు కోరుతున్నారు.

ఆధునిక యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

» జిల్లా వ్యవసాయాధికారి ఎం.ఆశాదేవి



ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఎం.ఆశాదేవి

సబ్బవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ఆధునిక యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎం.ఆశాదేవి అన్నారు. మండలంలోని అమృతపురంలో వ్యవసాయాధికారులు మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. వరి, ఉద్యాన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రబీకి అవసరమైన అపరాల విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మండలంలో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని, ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ అవుతాయని ఆమె తెలిపారు. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ యోజన కింద నగదు సాయం అందని రైతులు వ్యవసాయ శాఖ గ్రీవెన్స్‌లో సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ఏవో పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, ఎంపీటీసీ సభ్యుడు సింగంపల్లి శ్రీను, పలువురు రైతులు వున్నారు.

మత్స్యగెడ్డ తీరాన సూర్యోదయ సోయగం



సుజనకోట సమీపంలో మత్స్యగెడ్డ తీరాన ఆవిష్కృతమైన సుందర దృశ్యం

ముంచంగిపుట్టు మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రం సమీపంలో మంగళవారం మత్స్యగెడ్డ తీరాన సూర్యోదయం కనువిందు చేసింది. ఎత్తైన పచ్చని గిరుల నడుమ ప్రవహిస్తున్న మత్స్యగెడ్డపై పరుచుకున్న పొగమంచు, వాటిపై పడుతున్న లేలేత సూర్యకిరణాలు ఆ ప్రాంతాన్ని బంగారు వర్ణంలో మార్చేశాయి. ఈ సుందరమైన సూర్యోదయ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

- ముంచంగిపుట్టు/ఆంధ్రజ్యోతి

పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతిగృహాల్లో అందరూ పాసవ్వాలి

» ఇప్పటి నుంచే ప్రణాళిక అమలు
» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
» ప్రిన్సిపాళ్లు, వార్డెన్లతో వీడియో కాన్ఫరెన్స్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వసతిగృహాలు, గురుకులాలు, ఆశ్రమాలు, కేజీబీవీల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో ఆయా యాజమాన్యాల నిర్వహణలో వున్న విద్యా సంస్థలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల హాజరు, పరీక్షలకు ముందస్తు ప్రణాళిక, విద్యా ప్రమాణాల మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల వార్డెన్లు, ఇంటర్మీడియట్ బోర్డు, పాఠశాల విద్యా శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శతశాతం ఉత్తీర్ణత సాధనకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని అన్నారు. వసతిగృహాల్లో వుండే విద్యార్థులను చీటికీమాటికి ఇళ్లకు పంపవద్దని స్పష్టం చేశారు. పబ్లిక్ పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులంతా వసతిగృహాల్లోనే ఉండాలని, పరీక్షలు పూర్తయిన తరువాత ఇళ్లకు పంపించాలన్నారు.

వసతిగృహాల్లో వుంటున్న విద్యార్థులు రోజూ పాఠశాలలకు వెళుతున్నదీ లేనిదీ సంబంధిత హెచ్‌ఎంలను నిత్యం అడిగి తెలుసుకోవాలని చెప్పారు. బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల్లోకి సిబ్బందిని తప్ప ఇతరులను అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు రక్షిత తాగునీరు, నాణ్యమైన భోజనం అందించాలని, తరచూ వైద్యపరీక్షలు చేయించాలని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులంతా రాసేలా చూడాలని అన్నారు. వసతిగృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, కుక్కలు, కోతులు వంటివి వసతిగృహాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో జి.అప్పారావునాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏడాదిలో గంజాయి రవాణా నిర్మూలన

» ఎస్పీ తుహిన్ సిన్హా
» ఎస్.రాయవరం పీఎస్, నక్కపల్లి సర్కిల్ కార్యాలయం సందర్శన



ఎస్.రాయవరం స్టేషన్‌లో ఎస్‌ఐ విభీషణరావుతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఎస్.రాయవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది డిసెంబరునాటికి జిల్లా మీదుగా గంజాయి రవాణాను పూర్తిగా కట్టడి చేస్తామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఆయన మంగళవారం ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌ను, అడ్డరోడ్డులోని నక్కపల్లి సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల గురించి సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ విభీషణ రావులను అడిగారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, జాతీయ రహదారి మీదుగా గంజాయి రవాణా కాకుండా నక్కపల్లి సర్కిల్ పరిధిలో వాహనాల తనిఖీని విస్తృతం చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించినట్టు చెప్పారు. సైబర్ నేరాల విషయంలో గ్రామీణులను అప్రమత్తం చేసి అవగాహన కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. పోక్సో, ఈవ్‌టీజింగ్ చట్టాలపై విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కూడళ్లు, ఇతర కీలక ప్రాంతాల్లో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయన వెంట నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, సిబ్బంది వున్నారు.

13న ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశం

» అలూమ్ని అసోసియేషన్ చైర్మన్ కేవీవీ రావు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశాన్ని 'వేవ్స్-2025' కార్యక్రమాన్ని ఈ నెల 13న నిర్వహిస్తున్నట్టు ఏయూ అలూమ్ని అసోసియేషన్ చైర్మన్ కేవీవీ రావు వెల్లడించారు. మంగళవారం ఉదయం అలూమ్ని జీఎంఆర్ సెమినార్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మహిళా సాధికారిత థీమ్‌తో ఈ ఏడాది అలూమ్ని సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా సాధికారతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న రాజ్యసభ ఎంపీ, రచయిత, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మూర్తి ట్రస్ట్ చైర్‌పర్సన్ సుధామూర్తి హాజరవుతున్నారన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అలూమ్ని వ్యవస్థాపక అధ్యక్షులు గ్రంధి మల్లికార్జునరావు, తదితరులు పాల్గొంటారన్నారు. ఇప్పటివరకూ పది వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, రెండు వేల మందికిపైగా హాజరవుతారన్నారు. ప్రధాన వేదికతోపాటు ప్రాంగణం వెలుపల ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశానికి వర్సిటీపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ నెల 13న ఉదయం ప్రతి విభాగంలో పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం వేవ్స్-2025 కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టర్‌ను వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ అలూమ్ని చైర్మన్ కేవీవీ రావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజ, జనరల్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

» 12 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు

కొత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు నర్సింగరావుపేట వద్ద జాతీయ రహదారిపై ఆగివున్న ఆర్టీసీ బస్సును వెనుకనుంచి లారీ ఢీకొన్నది. ఈ సంఘటనలో 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ ఎస్‌ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి ఎలమంచిలి వెళుతున్న ఆర్టీసీ బస్సు మంగళవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో అనకాపల్లి మండలం కేఎన్‌ఆర్‌పేట సాయిబాబా గుడి వద్దకు చేరింది. ఈ సమయంలో బస్సు ముందున్న లారీకి గేదెలు అడ్డు రావడంతో లారీతోపాటు బస్సు కూడా ఆగాయి. అయితే వెనుక నుంచి వస్తున్న మరో లారీ, ఆర్టీసీ బస్సును ఢీకొంది. బస్సు ముందుకు వెళ్లి లారీని ఢీకొంది. దీంతో బస్సు స్టీరింగ్ వెనక్కు రావడంతో డ్రైవర్ రాజు అస్వస్థతకు గురయ్యాడు. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో 12 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐ అశోక్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ నాగేశ్వరరావు సిబ్బందితో వచ్చి ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించారు. క్షతగాత్రులను అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం డ్రైవర్ రాజును విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రెసిడెన్షియల్ స్కూల్ నుంచి ఆరు విద్యార్థులు అదృశ్యం



స్కూల్ నుంచి అదృశ్యమైన విద్యార్థులు వీరే

రాంబిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీటీ రెసిడెన్షియల్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించడంలేదని పోలీసులకు సమాచారం అందింది. డి.జశ్వంత్, ఎం.హిమతేజ, ఎస్.భరత్, బి.లక్ష్మణరావు, పి.వరుణ్, యు.రాజారావు అనే విద్యార్థులు స్కూల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో సీఐ నరసింగరావు మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆయా విద్యార్థుల ఫొటోలను పలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు.

నేటి నుంచి 12 కేంద్రాల్లో టెట్

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు జిల్లాలోని 12 కేంద్రాల్లో నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. విశాఖ జిల్లాలో 11, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ఒక కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులతో కలిసి మొత్తం 26,248 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. రెండు పూటలా నిర్వహించే పరీక్ష సజావుగా జరిగేలా అధికారులు సహకరించాలని డీఈవో కోరారు. తమ కార్యాలయంలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశామని, అధికారులు లేదా అభ్యర్థులు సహాయం కోసం 91772 92969, 96185 84051, 83285 24861 ఫోన్ నంబర్లను సంప్రతించాలని కోరారు.

14న వైజాగ్ నేవీ మారథాన్

» 17 దేశాల నుంచి ప్రతినిధులు

విశాఖపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేవీ దినోత్సవంలో భాగంగా తూర్పు నౌకాదళం ఈ నెల 14న 'వైజాగ్ నేవీ మారథాన్' నిర్వహించనున్నదని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వెల్లడించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, పదో ఎడిషన్‌గా నిర్వహిస్తున్న ఈ మారథాన్‌లో 1,750 మంది పాల్గొంటున్నారని, 17 దేశాల ప్రతినిధులు కూడా వస్తున్నారన్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లలో వేయి మంది సిబ్బంది, రెండు వేల మంది వలంటీర్లు సేవలు అందిస్తారాన్నరు. ఈ పోటీలు 42 కి.మీ., 21 కి.మీ., 10 కి.మీ., 5 కి.మీ. విభాగాల్లో జరుగుతాయన్నారు. మారథాన్ విశాఖలో ఆర్‌కే బీచ్ వద్ద ప్రారంభమై, తీరం వెంబడి భీమిలి వరకూ కొనసాగుతుందన్నారు. ప్రతి రన్నర్‌కు డ్రై-ఫిట్ టీ షర్ట్, నేవీ థీమ్ మెడల్, గూడీ బ్యాగ్, అల్పాహారం అందజేస్తారన్నారు. ప్రజలకు శారీరక దృఢత్వం, సముద్ర వ్యవహారాలపై అవగాహన పెంచడమే దీని ఉద్దేశమన్నారు. దీనికి ముందు ఆయన నేవీ, జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నేవీ కెప్టెన్లు టీఆర్‌ఎస్ కుమార్, వినోత్ తివారీ, కమాండర్ కిశోర్, లెఫ్టినెంట్ కమాండర్లు పి.మోహంత్ నాయుడు, నరేశ్, ఏడీసీ రమణమూర్తి, ఈపీడీసీఎల్ ఎస్‌ఈ శ్యాంబాబు పాల్గొన్నారు.

'కాఫీ పండ్ల కొనుగోలు ధర పెంపు'

చింతపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాఫీ పండ్ల కొనుగోలు ధరను మ్యాక్స్ పెంచిందని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజన రైతులు పండించిన కాఫీ పండ్లకు మ్యాక్స్ అంతర్జాతీయ ధరలను అందిస్తున్నదన్నారు. గత ఏడాది తొలి విడత కిలో పండ్లకు రూ.44 ధర చెల్లించి, రెండు విడతల్లో బోనస్ రూ.ఎనిమిది చొప్పున చెల్లించిందన్నారు. గరిష్ఠంగా కిలోకి రూ.60 ధర రైతుకి అందించామని చెప్పారు. ఈ ఏడాది మార్కెట్ ప్రారంభంలో తొలి విడత ధర ఏ-గ్రేడ్ రూ.60, బీ- గ్రేడ్ ధర రూ.55గా నిర్ణయించామన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఆధారంగా తొలి విడత ధర ఏ- గ్రేడ్ రూ.70, బీ- గ్రేడ్ రూ.60గా పెంచామన్నారు. ఇప్పటికే పాత ధరలతో మ్యాక్స్‌కి పండ్లు అందజేసిన రైతులకు సైతం ఈ కొత్త ధరలు వర్తిస్తాయని తెలిపారు.

ఊరూరా గ్రావెల్ దోపిడీ

... 5వ పేజీ తరువాయి

ఇదే పరిస్థితి నెలకొంది. అయితే ఇక్కడ ప్రజల అవసరాల కోసమే గ్రావెల్ తవ్వినట్టు అధికారులు, స్థానిక నేతలు చెబుతున్నారు. అరిపాక నుంచి నల్లరేగుపాలెం వెళ్లే రోడ్డుకు అనుకొనిఉన్న పోతు కొండ అటవీ భూముల్లో ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు

... 5వ పేజీ తరువాయి

కనీస వేతన చట్టం అమలు చేయడంలేదు. స్థానిక కూలీలు అయితే ఎక్కువ కూలి డిమాండ్ చేస్తారన్న ఉద్దేశంతో వెనుకబడిన ప్రాంతమైన ఒడిశా నుంచి కుటుంబాలతో సహా కూలీలను రప్పించుకుంటున్నారు. వీరికి అడ్వాన్సుల రూపంలో కొంత సొమ్మును ముట్టజెప్పి, బట్టీల్లో తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులు తమ పిల్లలను బడికి పంపకుండా.. ఇటుకల తయారీ పనులు చేయిస్తున్నారు. కార్మిక శాఖ అధికారులు నిష్పక్షపాతంగా తనిఖీలు జరిపితే ఇటువంటి ఉల్లంఘనలు బయటపడతాయి. కాగా ఇటుక బట్టీల నిర్వాహకులు నిబంధనల ఉల్లంఘనపై గనుల శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. మట్టి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తయారు చేసిన ఇటుకల సంఖ్యనుబట్టి రాయల్టీ చెల్లించాలన్నారు. జిల్లాలో ఎన్ని ఇటుకల బట్టీలు ఉన్నాయనేది మండలాల నుంచి వివరాలు సేకరిస్తున్నామన్నారు.

రాంబిల్లిలో సోలార్ కంపెనీ

... 5వ పేజీ తరువాయి



బోర్డు సిఫారసుతో ఈ ఫైల్ వచ్చే వారం రాష్ట్ర మంత్రివర్గం క్లియరెన్స్‌కు వెళుతున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి నిర్మాణాన్ని 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని, వాణిజ్య కార్యకలాపాలను 2028 జనవరికి ప్రారంభిస్తామని సంస్థ తన ప్రతిపాదనల్లో పేర్కొంది.

దీంతో పాటు రెండు గిగావాట్ల హైడ్రో స్టోరేజీ ప్రాజెక్టు, 300 కేటీపీఏ సామర్థ్యంతో గ్రీన్ అమ్మోనియా ప్లాంటు, ఐదు గిగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ప్రాజెక్టులు (విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్) ఏర్పాటుచేస్తుంది. వీటన్నింటికీ కలిపి రూ.82 వేల కోట్లు పెట్టుబడి పెడతామని ఇటీవల జరిగిన సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో ఒప్పందం చేసిందని తెలిసింది. వీటిని నడపడానికి రోజుకు 95 మెగావాట్ల నిరంతర విద్యుత్, రోజుకు పది మిలియన్ లీటర్ల నీరు అవసరమని, అందుకు తగిన ఏర్పాట్లుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

కోతుల బెడద లేకుండా చూస్తాం

... 5వ పేజీ తరువాయి

స్పష్టం చేశారు. దీంతో ఎంఈవో, ఎస్‌ఐ నచ్చచెప్పడంతో ఇక్కడే వుంటామని బాలికలు చెప్పారు. హాస్టల్ ఆవరణలో చెట్లు విపరీతంగా పెరిగిపోయి అడవిని తలపిస్తున్నదని, ఈ కారణంగానే కోతులు, కుక్కలు లోపలికి వస్తున్నాయని ఈ సందర్భంగా విద్యార్థునుల తల్లిదండ్రులు అరుకు అప్పారావు, కింజాడ కొండబాబు, ఎం.భాను ప్రకాశ్, మల్లేటి రాము, ఎ.శ్రీను, పవన్, జె.ఈశ్వరరావు తదితరులు మేట్రిన్‌ను ఉద్దేశించి అన్నారు. కోతుల బెడద నివారణకు ఫారెస్టు అధికారుల సాయం కోరామని, కొన్ని చెట్ల తొలగింపుకు ఉన్నతాధికారుల అనుమతి కోరుతామని మేట్రిన్ తెలిపారు. కాగా ఆదివారం రాత్రి కోతుల దాడి తరువాత సుమారు 20 మంది బాలికలు భయంతో సోమవారం తమ ఇళ్లకు వెళ్లిపోయారు.